
మళ్లీ సీఎంగా..

చంద్రబాబు కోసం ఎదురుచూస్తున్న కుప్పం

- ఇక పెండింగ్ పనులకు మోక్షం
- నేడు, రేపు నియోజకవర్గంలో పర్యటన



ఎక్కడికక్కడ ఆగిన పనులు. గుక్కెడు శుద్ధ జలం కోసం ఎండుతున్న గొంతుకలు. దిక్కూ దరీలేని తోవలు. ముందుకు కదలని హంద్రీనీవా జగన్మాయా జలాలు. అభివృద్ధి మాట ఇసుమంతైనా వినిపించని వైసీపీ పాలనలో కుప్పం ఒక అనాథలా మిగిలిన దుస్సహ సందర్భాలు గుర్తుకొస్తున్నాయి. తిరిగి పూర్వ ప్రాభవ వైభవాల దిశగా జనం ఆశలు పరుగులు పెడుతున్నాయి. నాలుగోసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తమ ఎమ్మెల్యే చంద్రబాబు నాయుడి కోసం కుప్పం ఎదురు తెన్నులు చూస్తోంది. మంగళ, బుధవారాల్లో చంద్రబాబు పర్యటన కోసం అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

- కుప్పం



అవుటర్ రింగ్ రోడ్డు దుస్థితి

ఆగిన అవుటర్ రింగ్ రోడ్డు

కుప్పం పట్టణంలో ట్రాఫిక్ సమస్య శాశ్వత పరిష్కారానికి 2014లో సీఎం హోదాలో చంద్రబాబు రూ.50-రూ.60 కోట్ల అంచనాతో అవుటర్ రింగ్ రోడ్డును మంజూరు చేశారు. విజలాపురం సర్కిల్‌నుంచి కుప్పం చెరువు కట్టమీదుగా ప్రారంభమయ్యే ఈ అవుటర్ రింగ్ రోడ్డు డీకేపల్లె చెరువు కట్ట, పలార్లపల్లె మీదుగా వచ్చి జాతీయ రహదారిలో కలుస్తుంది. విజలాపురం సర్కిల్‌నుంచి కుప్పం చెరువు కట్టమీదుగా గుడుపల్లె రోడ్డు దాకా నిర్మాణం కూడా పూర్తయింది. మరోవైపు డీకేపల్లె చెరువు కట్టను వెడల్పు చేశారు. వైసీపీ అధికారంలోకి రాగానే ఆగిపోయిన ఈ అవుటర్ రింగ్ రోడ్డు పనుల్లో కదలిక వస్తుందన్న ఆశతో ప్రజలు ఉన్నారు.

ఆర్‌అండ్‌బీ భవనమూ అంతే



వైసీపీ అధికారంలోకి రావడంతో కుప్పం పట్టణంలోని ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్ పనులు కూడా మధ్యలోనే ఆగిపోయాయి. దీని నిర్మాణం పూర్తి చేయాల్సిన అవసరం ఉంది.

ఎన్టీఆర్ సుజల నిర్వీర్యం

టీడీపీ హయాంలో ఎన్టీఆర్ సుజల పేరుతో నియోజకవర్గ ప్రజలకు శుద్ధ జలాన్ని అందించే చర్యలు చేపట్టారు. తొలుత డీకేపల్లె చెరువులో అదనంగా నాలుగైదు బోర్లు వేసి, ఆ సమీపంలోని పార్కులోనే మదర్ ప్లాంట్ ఏర్పాటు చేశారు. కుప్పం పట్టణంతోపాటు చుట్టుపక్కల ఐదారు పంచాయతీలకు శుద్ధ జలాన్ని సరఫరా చేశారు. ఎక్కడికక్కడ డిస్పెన్సివ్ యూనిట్లు నిర్మించారు. వీధివీధినా రూ.2కే 20 లీటర్ల శుద్ధ జలాన్ని అందించారు. తర్వాత మల్లానూరు, నడిమూరు, కంగుంది వంటి గ్రామీణ ప్రాంతాలతోపాటు నాలుగు మండల కేంద్రాలు, మేజర్ పంచాయతీలలో మదర్ ప్లాంట్లు ఏర్పాటు చేశారు. తొలుత ఎన్టీఆర్ ట్రస్టు ద్వారా ప్రారంభమైన ఎన్టీఆర్ సుజల ప్రాజెక్టు, అనంతరం ఆర్‌డబ్ల్యూఎస్ నిర్వహణలోకి వెళ్లింది. వైసీపీ అధికారంలోకి వచ్చాక వీటి నిర్వహణను గాలికి వదిలేసి నిర్వీర్యం చేశారు. ఇప్పుడు కుప్పంలో ఒకట్రెండు చోట్ల రూ.5కు శుద్ధ జలాన్ని ఇస్తున్నారు.



గుడుపల్లె మండలం శెట్టిపల్లె వద్ద ప్లాంటు దుస్థితి

జగన్మాయలో ఎండమావిగా హంద్రీనీవా జలాలు

ఫిబ్రవరి 26వ తేదీన నాటి సీఎం జగన్ రామకుప్పం మండలం రాజుపేట వద్ద హంద్రీనీవా జలాల విడుదల అనే నాటకం ఆడారు. ఆ తర్వాత కాలువ పనులు పూర్తయ్యాయని, జలాలు గ్రామాలవైపు పరుగులు పెట్టి పొలాలను సస్యశ్యామలం చేస్తున్నాయని అటు వైసీపీ నాయకులు, ఇటు నాటి అధికార యంత్రాంగం మాయ జేయడానికి చేసిన ప్రయత్నాలు అభాసుపాలయ్యాయి. ప్రారంభించిన మరుసటి రోజునే గేటును ఎత్తుకెళ్లిపోయిన ప్రభుత్వ అపహాస్యపు దృశ్యాలు నేటికీ మరువలేక పోతున్నారు కుప్పం జనం. నిజానికి 2014-19 మధ్య కాలంలో నాటి టీడీపీ ప్రభుత్వ హయాంలో హంద్రీ-నీవా కుప్పం బ్రాంచి కాలువ నిర్మాణానికి తొలుత రూ.430 కోట్లను అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు మంజూరు చేశారు. ఆ తర్వాత ఈ అంచనాలను దాదాపు రూ.500 కోట్లకు పెంచారు. సుమారు 75 శాతం పనులు నాటి ప్రభుత్వ హయాంలోనే పూర్తయ్యాయి. వి.కోట మండలం దాకా నీళ్లు వచ్చి ఆగాయి. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ.. హంద్రీ-నీవా కాలువకు పైసా కూడా విడుదల చేయలేదు. ఎన్నికలకు ఆరేడు నెలల ముందు పనులు జరిగిపోతున్నట్లు డ్రామాలు మొదలు పెట్టారు. కానీ నీటి జాడ మాత్రం లేదు. ఇప్పుడు చంద్రబాబు సీఎం కావడంతో హంద్రీ-నీవా జలాలపై ప్రజల ఆశలు చిగురిస్తున్నాయి. అందుకు తగ్గట్టుగానే ఆయన కూడా మంగళవారం పర్యటనలో తొలుతగా శాంతిపురం మండలం జల్లిగానిపల్లె, చిన్నారిదొడ్డి గ్రామాల సమీపంలో హంద్రీ నీవా కాలువను పరిశీలించనున్నారు. కాలువ నిర్మాణం, నిధుల మంజూరుపై ప్రకటన చేసే అవకాశం ఉంది.



అర్ధంతరంగా ఆగిన శీతల గిడ్డంగి నిర్మాణం




పండిన పంటను నిల్వ చేసి ధరలు వచ్చినప్పుడు అమ్మడానికి వినియోగపడే శీతల గిడ్డంగి నిర్మాణంపై టీడీపీ దృష్టి పెట్టింది. కుప్పం మార్కెట్ యార్డులో సుమారు రూ.11 కోట్లతో పనులు చేపట్టారు. నిర్మాణం ఉధృతంగా సాగుతున్న దశలో వైసీపీ అధికారంలోకి వచ్చింది. అక్కడితో ఆ పనులు ఆగాయి.

నేతాజీరోడ్డు విస్తరణకూ బ్రేక్



కుప్పంలో ప్రధాన రహదారి అయిన నేతాజీ రోడ్డు విస్తరణ పనులను రూ.60 కోట్లతో టీడీపీ హయాంలో చేపట్టారు. కుప్పం చెరువు కట్టనుంచి గంగమ్మ ఆలయం.. అక్కడ్నుంచి ఎమ్మార్‌రెడ్డి సర్కిల్.. ఇక్కడ్నుంచి పాత రైల్వే గేటు దాకా.. ఇలా మూడు దశలుగా విభజించి.. ఒక్కో దశకు రూ.20 కోట్ల వంతున కేటాయించారు. మూడు దశల్లో అనుకున్న రోడ్డు విస్తరణ పనులు చివరి దశకు వచ్చి ఆగిపోయాయి. ఈ పనులు పూర్తయితే రోడ్లు విశాలమై ట్రాఫిక్ సమస్య తీరేది.

ఆగిన సాగునీటి రిజర్వాయర్లు



గుడుపల్లె మండలం యామనూరు వద్ద రిజర్వాయర్‌కోసం ప్రతిపాదించిన ప్రాంతం

శాంతిపురం మండలం ప్రీతిచామనూరు సమీపంలో రూ.50 కోట్ల అంచనాతో టీడీపీ హయాంలో సాగునీటి రిజర్వాయరు నిర్మాణాన్ని తలపెట్టారు. అలాగే, గుడుపల్లె మండలం యామనూరు సమీపంలో సుమారు రూ.150 కోట్లతో మరో సాగునీటి ప్రాజెక్టు కట్టాలని భావించారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక ఈ రెండూ అతీగతీ లేకుండా పోయాయి.

ఇంకా ఎన్నెన్నో?

పైన పేర్కొన్న ప్రధానమైన అభివృద్ధి పనులతోపాటు నాలుగు మండలాల్లోనూ ఈ అయిదేళ్లలో ధ్వంసమైన పలు రోడ్లను మరమ్మతు చేయాల్సిన అవసరం ఉంది. కుప్పం పట్టణంలో అక్కడక్కడా తప్ప గ్రామీణ ప్రాంతాలలో ఒక్కటంటే ఒక్క రోడ్డు కూడా వైసీపీ హయాంలో వేయలేదు. ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ రోడ్లు సైతం అక్రమ క్వారీ వాహనాలు, ఇసుక వాహనాల రాకపోకలతో ధ్వంసమయ్యాయి. వీటిని మరమ్మతు చేయడంతోపాటు సరికొత్త రహదారులు, మురుగు నీటి కాలువల నిర్మాణం చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

చంద్రబాబు బహిరంగ సభ కోసం సిద్ధమైన ఎన్టీఆర్ విగ్రహం స్టేజీ



నేటి సీఎం పర్యటన ఇలా..

మధ్యాహ్నం 12.30 గంటలకు: పీఈఎస్ వైద్య కళాశాల హెలిప్యాడ్‌కు రాక
12.55: శాంతిపురం జల్లిగానిపల్లె గ్రామ సమీపంలోని హంద్రీనీవా కాలువ పరిశీలన
1.55: శాంతిపురం మండలం చిన్నారిదొడ్డి సమీపంలో హంద్రీనీవా కాలువ పరిశీలన
2.10: కుప్పం ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌కు రాక.. విరామం
3.00: ఎన్టీఆర్ విగ్రహం కూడలి వద్ద బహిరంగ సభ
4.35: ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో పార్టీ నేతలతో సమావేశం



కుప్పం చేరిన పోలీసు బలగాలు

భూసమస్యల పరిష్కారంపై దృష్టి

- నూతన కలెక్టరుగా బాధ్యతలు స్వీకరించిన సుమిత్ కుమార్

చిత్తూరు కలెక్టరేట్, జూన్ 24: జిల్లాలోని ప్రభుత్వ భూసమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యం ఇస్తానని కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. సోమవారం ఉదయం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఆయన.. మీడియాతో మాట్లాడారు. జిల్లాలో తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపడతామన్నారు. ప్రభుత్వ ప్రాధాన్యత అంశాల అమలుపై దృష్టిపెడతానని, వాటిని పారదర్శకంగా అధికారుల సహకారంతో అమలు చేస్తామన్నారు. కాగా, ఉదయం 9.30 గంటలకు కలెక్టరేట్‌కు చేరుకున్న ఆయనకు డ్వామా పీడీ రాజశేఖర్ పుష్పగుచ్ఛం బహూకరించి స్వాగతం పలికారు. తన చాంబర్ చేరుకుని కలెక్టర్‌గా ఆయన బాధ్యతలు స్వీకరించారు. జిల్లా యంత్రాంగం తరపున డీఆర్వో పుల్లయ్య పుష్పగుచ్ఛం బహూకరించారు. కాణిపాక వరసిద్ధి వినాయకస్వామి ఆలయ వేదపండితులు వేదాశీర్వచనాలు అందజేయగా, ఈవో వెంకటేశు వినాయకస్వామి చిత్రపటాన్ని అందజేసి సన్మానించారు. కలెక్టరేట్ ఏవో వెంకటేశ్వర్లు, ఏపీ రెవిన్యూ సర్వీసెస్ అసోసియేషన్ కలెక్టరేట్ యూనిట్ నాయకులు హుస్సేన్, పార్థసారధి, హేమాద్రిరాజు, వీఆర్వో సంఘ అధ్యక్షుడు బాలాజీ రెడ్డి, వీఆర్వోలు, సాంఘికసంక్షేమశాఖ డీడీ రాజ్యలక్ష్మి, ఐ&పీఆర్ డీడీ పద్మజ, డీపీవో లక్ష్మి, డీసీసీబీ సీఈవో మనోహర్ గౌడ్, డీసీవో నాగవర్ధనతో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు కలెక్టర్‌కు స్వాగతం పలికారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న సుమిత్ కుమార్

సచివాలయ సిబ్బందితో ఇంటికే పింఛన్లు

రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయం ● అరియర్స్‌తో కలిసి జూలై 1న రూ.7 వేలు అందజేత
● 2,72,223 మందికి లబ్ధి

చిత్తూరు, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): జూలై ఒకటో తేదీన సచివాలయ సిబ్బందితో ఇళ్లకే పింఛన్లు అందించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు మంగళవారం జరిగిన తొలి మంత్రివర్గ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. వైసీపీ హయాంలో వలంటీర్లచేత పింఛన్లు పంపిణీ చేసిన విషయం తెలిసింది. జిల్లాలోని 108 వార్డు సచివాలయాల్లో 768 మంది, 504 గ్రామ సచివాలయాల్లో 3677 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. జిల్లాలో 2,72,223 మందికి పింఛన్లు ఇవ్వాల్సి ఉంటుంది. 4445 మంది సచివాలయ సిబ్బందితో పింఛన్లను పంపిణీ చేయిస్తే.. సగటున ఒక్కో ఉద్యోగి పరిధిలోకి 60 కంటే తక్కువ పింఛన్లు వస్తాయి. ఒక్క రోజులో పూర్తి చేయవచ్చు. సచివాలయ సిబ్బందితో పింఛన్ల పంపిణీ విధానం తాత్కాలికమా.. శాశ్వతమా.. అనేది తెలియాల్సి ఉంది. ఇక వలంటీరు వ్యవస్థలో ఎలాంటి మార్పులు చేయనుందనేది స్పష్టత లేదు. కాగా, ఎన్నికల ముందు హామీ ఇచ్చినట్లే చంద్రబాబు ప్రభుత్వం జూలై ఒకటి నుంచి రూ.4 వేలకు పెంచిన పింఛన్లను పంపిణీ చేయనుంది. అలాగే మూడు నెలల బకాయిలతో కలిపి తొలినెలలో రూ.7 వేలు ఇవ్వనున్నారు. ఇక, దివ్యాంగులకు రూ.3 వేల నుంచి రూ.6 వేలకు.. పూర్తి స్థాయిలో అంగవైకల్యం కలిగి ఉన్నవారికి రూ.15 వేలు.. కిడ్నీ, తలసేమియా వంటి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్నవారికి రూ.10 వేలు చొప్పున పింఛను పెంచిన విషయం తెలిసిందే. అధికారంలోకి వచ్చిన తొలి నెలలోనే పెంచిన పింఛన్లను ఇవ్వడంపై పెన్షన్‌దారుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

● మరోవైపు మెగా డీఎస్సీకి మంత్రివర్గం ఆమోదం తెలిపింది. జూలై 1 నుంచి డీఎస్సీ ప్రక్రియ ప్రారంభించి డిసెంబరు 10లోగా 16,347 టీచర్ పోస్టుల భర్తీ చేసేలా షెడ్యూల్ ప్రకటించారు. మన జిల్లాలో 600కుపైగా టీచర్ పోస్టుల్ని భర్తీ చేసే అవకాశముంది. అలాగే, ల్యాండ్ టైటిలింగ్ యాక్టు రద్దు, అన్న క్యాంటీన్ల పునరుద్ధరణ, నైపుణ్య గణన అంశాలనూ మంత్రిమండలి ఆమోదించింది.

జలకంఠేశ్వరస్వామి ఆలయం వద్ద ఏనుగుల స్వైరవిహారం

పెద్దపంజాణి, జూన్ 24: పెద్దపంజాణి మండలం కోగిలేరు సమీప అటవీ ప్రాంతంలో ఉన్న జలకంఠేశ్వర స్వామి ఆలయం వద్ద ఆదివారం రాత్రి ఏనుగులు స్వైరవిహారం చేశాయి. ఆలయ ప్రాకారానికి ఏర్పాటు చేసిన ఇనుప గ్రిల్‌ను ధ్వంసం చేశాయి. ఆలయం వెలుపల హోమగుండాలు, పూలమొక్కలతో పాటు పూజారి ఇంటి గోడనూ కూల్చి వేశాయి. దాదాపు రూ.50వేల నష్టం వాటిల్లినట్లు ఆలయ ధర్మకర్తలు తెలిపారు. అటవీ ప్రాంతం కావడంతో రాత్రి వేళలో ఇక్కడ ఎవరూ నివాసం ఉండరు. దీంతో ప్రాణాపాయం తప్పింది.




ఆలయ ప్రాకారంలో ఇనుప గ్రిల్‌ను.. పూజారి ఇంటి గోడను ధ్వంసం చేసిన ఏనుగులు



... అను నేను

చిత్తూరు లోక్‌సభ సభ్యుడిగా సోమవారం దగ్గుమళ్ల ప్రసాదరావు (టీడీపీ) పార్లమెంటులో ప్రమాణ స్వీకారం చేశారు. ఆయనకు పలువురు టీడీపీ నేతలు శుభాకాంక్షలు తెలిపారు.

పసుపుమయం.. అధికారుల దళం





కుప్పంలో వెలసిన స్వాగత బ్యానర్లు, ఎన్టీఆర్ విగ్రహం ఎదుట ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎస్పీ మణికంఠ తదితరులు

● కుప్పంలో సీఎం పర్యటన ఏర్పాట్లు పూర్తి

కుప్పం, జూన్ 24: ముఖ్యమంత్రి చంద్రబాబు కుప్పం పర్యటన ఏర్పాట్లు సోమవారం రాత్రికి పూర్తయ్యాయి. వారం రోజులుగా జిల్లా.. స్థానిక అధికార యంత్రాంగం కూడా కుప్పంలోనే ఉండి, ఏర్పాట్లను పర్యవేక్షిస్తోంది. మరోవైపు టీడీపీ శ్రేణులు కుప్పాన్ని పసుపుమయం చేశాయి. ఆదివారందాకా అప్పటి కలెక్టర్ షన్మోహన్.. సోమవారం మధ్యాహ్నం నుంచి కొత్త కలెక్టరు సుమిత్‌కుమార్ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. ఎస్పీ మణికంఠ ఆధ్వర్యంలో భద్రతా చర్యలు చేపట్టారు. సోమవారం రాత్రికి కుప్పం చేరుకున్న ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ అధికారులతో సమన్వయం చేసుకుని సీఎం పర్యటన ఏర్పాట్లను పర్యవేక్షించారు. పీఈఎస్ వైద్య కళాశాల మైదానంలో హెలిప్యాడ్ సిద్ధం చేశారు. బహిరంగ సభ కోసం ఎన్టీఆర్ విగ్రహం ఎదుట ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్ వద్ద వినతుల స్వీకరణకు పటిష్ఠమైన బ్యారికేడింగ్ నిర్మించారు. కాగా, సీఎం చంద్రబాబు పర్యటించే ప్రాంతాలను సోమవారం అధికారులు పరిశీలించారు. మరోవైపు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అదనపు పోలీసు బలగాలు కుప్పంలో మొహరించాయి. సీఎం పర్యన షెడ్యూల్ ఉన్న ప్రతి చోటా ప్రభుత్వాధికారులను ఇన్‌ఛార్జిలుగా నియమించారు. మరోవైపు చంద్రబాబు పర్యటన నేపథ్యంలో టీడీపీ శ్రేణులు కుప్పం పట్టణాన్ని పసుపుమయం చేశాయి. అధినేతకు స్వాగతం పలుకుతూ అడుగడుగునా ఫ్లెక్సీలు, బ్యానర్లు వెలిశాయి.

చేరికలు ఉండవు

ముఖ్యమంత్రి చంద్రబాబు రాక సందర్భంగా వైసీపీనుంచి టీడీపీలోకి ఎటువంటి చేరికలు ఉండబోవని ఎమ్మెల్సీ శ్రీకాంత్ 'ఆంధ్రజ్యోతి'కి స్పష్టం చేశారు. పలువురు కౌన్సిలర్లు, జడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు వైసీపీనుంచి టీడీపీలో చేరనున్నారన్న ప్రచారం సామాజిక మాధ్యమాల్లో సోమవారం హల్‌చల్ చేసింది. దీనిపై ఆయన స్పందించారు. ప్రస్తుతానికి ఎటువంటి చేరికలు ఉండవని, అవి తప్పుడు ప్రచారాలని కొట్టేశారు. ఆ అవసరం తమకు లేదన్నారు. ఎన్నికల్లో చంద్రబాబు విజయంకోసం కష్టపడిన ప్రతి కార్యకర్తకు, నాయకుడికి సముచిత స్థానం లభిస్తుందని చెప్పారు.

మంత్రి నారా లోకేశ్‌ను కలిసిన ఎమ్మెల్సీ కంచర్ల



కుప్పం, జూన్ 24: ఐటీ, ఎలక్ట్రానిక్స్, విద్యా శాఖా మంత్రి నారా లోకేశ్‌ను ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్, సచివాలయంలో సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన లోకేశ్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. కుప్పం నియోజకవర్గ అభివృద్ధి కార్యక్రమాల గురించి మంత్రితో చర్చించారు.

పంటలపై ఆగని గజదాడులు



ఏనుగులు తొక్కేసిన వరి నారు

కల్లూరు: పులిచెర్ల మండలంలో పంటలపై ఏనుగుల గుంపు దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. కల్లూరులోని అబ్దుల్ యాసిన్‌కు చెందిన ఎకరా టమోటా పంటను ధ్వంసం చేశాయి. సయ్యద్ బాషాకు చెందిన వరినారును తొక్కేశాయి. యుగంధర్‌కు చెందిన 6 మామిడిచెట్లు, 7 కొబ్బరి చెట్లను విరిచేశాయి. కోటపల్లి భాస్కర్ నాయుడు, పెదబ్బనాయుడుకు చెందిన 20 రాతికూసాలను.. బాబు నాయుడుకు చెందిన పశుగ్రాసంను ధ్వంసం చేశాయి. అనంతరం ఎర్రచెరువులోని గుంతలను తొక్కేశాయి.

వంగసానివారిపల్లెలో జంట ఏనుగులు

సోమల: సోమల మండలం ఆవులపల్లె పంచాయతీ వంగసానివారిపల్లె సమీపంలో జంట ఏనుగులు తిరుగుతున్నాయి. పంటలను ధ్వంసం చేస్తున్నాయి. టమోటా కోతల సమయంలో తోటను తొక్కేయడంతో నష్ట పోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. పంటలు కోల్పోయిన తమకు నష్టపరిహారం అందించాలని సచివాలయంలో వినతిపత్రం అందజేశారు.

మంత్రి లోకేశ్‌కి శ్రీవారి ప్రసాదాలు



నారా లోకేశ్‌కి శ్రీవారి ప్రసాదాలు అందజేస్తున్న హేమాంబరధరరావు

చంద్రగిరి, జూన్ 24: వెలగపూడిలోని సచివాలయంలో మంత్రిగా సోమవారం బాధ్యతలు స్వీకరించిన నారా లోకేశ్‌ని చంద్రగిరి మండలానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వీరపల్లి హేమాంబరధరరావు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రికి శ్రీవారి తీర్థ ప్రసాదాలు అందజేసి, శుభాకాంక్షలు తెలిపారు.

టమోటా తోటల్లో దొంగలు పడ్డారు

సోమల, జూన్ 24: టమోటాకు గిట్టుబాటు ధరలు ఉండడంతో చిల్లర దొంగలు తోటల్లో పడ్డారు. టమోటాలను కోసుకెళుతున్నారు. ఆదివారం రాత్రి సోమల- సదుం మార్గం అభయాంజనేయస్వామి ఆలయం సమీప బాయిగడ్డ నరసింహులు పొలంలోని టమోటా తోటలో కోతకు సిద్ధంగా ఉన్న 50 బాక్సుల టమోటాలను కోసుకెళ్లారు. నరసింహులుకు చెందిన రెండు ఎకరాలను కలకడకు చెందిన మురళి లీజుకు తీసుకుని టమోటా సాగు చేశారు. రైతులు పొలం వద్ద ఉన్నప్పటికీ రాత్రి కురిసిన వర్షానికి ఇంటి రావడంతో టమోటాలు చోరీ జరిగింది. చిన్న సోమల మార్గంలోని పలు తోటల్లో టమోటాలు చోరీలు జరుగుతున్నట్లు రైతులు తెలిపారు. 15 కిలోల బాక్సు రూ.800 వరకు పలకడంతో చిల్లర దొంగలు చోరీలకు పాల్పడుతున్నారు. కొందరు రైతులు పొలాల వద్ద విద్యుత్ లైట్లు ఏర్పాటు చేసి అక్కడే కాపు కాస్తున్నారు. ఆదమరిస్తే దుండగులు టమోటాలను కోసుకెళుతున్నారు.

వెంకటాపురంలో కొనసాగిన వైద్య శిబిరం

గుడుపల్లె, జూన్ 24: మండలం పరిధిలోని వెంకటాపురంలో గ్రామంలో సోమవారం కూడా వైద్య శిబిరం కొనసాగింది. రెండు రోజులుగా అతిసార కేసులు నమోదు కాకపోవడంతో అధికారులు ఊపిరి పీల్చుకొన్నారు. మూడు రోజుల క్రితం గ్రామంలోని పలువురు అతిసారం బారిన పడి అస్వస్థతకు గురయ్యారు. బాధితులు ఆస్పత్రిలో చికిత్స అనంతరం కోలుకొని ఇండ్లకు చేరుకొన్నారు. ఈ క్రమంలో గుడుపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో నాలుగు రోజులుగా వైద్య బృందం వైద్య శిబిరం ఏర్పాటు చేసి ప్రజలకు చికిత్స అందించారు. ఆ తరువాత గ్రామంలోని ప్రతి ఇంటికీ ఎన్టీఆర్ సుజల శుద్ధ నీటిని ప్రజలకు అందించారు. వైద్య శిబ్బంది ఇంటింటా తిరిగి ప్రజలకు సూచనలు చేశారు.

క్యాన్సర్ గుర్తింపుపై శిక్షణ

పలమనేరు, జూన్24 : పలమనేరు ప్రభుత్వ ఆస్పత్రిలో నియోజకవర్గంలోని వైద్యాధి కారులకు, వైద్యసిబ్బందికి సోమవారం క్యాన్సర్ గుర్తింపుపై ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆర్ఎంఓ శారద, డాక్టర్ మల్లికార్జునరెడ్డి, డాక్టర్ మాధవి శిక్షణ అందించారు. అక్టోబరు ఒకటి నుంచి ఇంటింటి సర్వే నిర్వహించనున్న నేపథ్యంలో వ్యాధి లక్షణాలు, చికిత్స తదితరాలపై వీడియో ద్వారా శిక్షణ అందజేశారు. ఈ కార్యక్రమంలో వి.కోట, తీర్థం, బైరెడ్డిపల్లి, పత్తికొండ, కొలమాసనపల్లి, గంగవరం, పెద్దపంజాణి, రాయలపేట పీహెచ్‌సీ వైద్యాధికారులు, నియోజకవర్గంలోని వైద్యఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న ఎక్స్‌కవేటరు

ద్విచక్రవాహనదారుడికి తీవ్రగాయాలు



చౌడేపల్లె, జూన్24: ద్విచక్ర వాహనదారుడిని ఎక్స్ కవేటర్ ఢీకొనడంతో అతడు తీవ్ర గాయాల పాలయ్యాడు. ఏకంగా అతడి మోకాలి చిప్ప ఊడిపోయింది. ఈ ఘటన చౌడేపల్లె మండలంలో సోమవారం జరిగింది. బాధితుడి కథనం మేరకు.. పలమనేరు మండలం జల్లిపేటకు చెందిన వెంకటప్ప(67) సొంత పనుల నిమిత్తం తన ద్విచక్ర వాహనంలో చౌడేపల్లెకు వస్తున్నాడు. చౌడేపల్లె నుంచి రాయలపేట వైపు వెళుతున్న ఎక్స్‌కవేటర్ దాదేపల్లె సమీపంలో ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. వెంకటప్ప మోకాలి చిప్ప తొలగిపోయి రోడ్డుపై పడింది. కుటుంబసభ్యులు ఆయన్ను తిరుపతిలోని స్విమ్స్‌కు తరలించారు.

తెలుగులో ప్రమాణస్వీకారంపై హర్షం

గంగవరం, జూన్ 24: రాష్ట్రం నుంచి ఎంపీలుగా ఎన్నికై కేంద్ర మంత్రులుగా స్థానం సంపాదించి పార్లమెంటులో తెలుగులో ప్రమాణ స్వీకారం చేయడం తెలుగు ప్రజలు హర్షించదగ్గ విషయమని తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షులు తులసీనాథం నాయుడు తెలియజేశారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు.

రాష్ట్రంలో ప్రజాపాలన మొదలైంది : చల్లా బాబు



చల్లా బాబుకు హారతులిస్తున్న మహిళలు

కల్లూరు, జూన్ 24: వైసీపీ ఐదేళ్ల అరాచక పాలన ముగిసిందని, రాష్ట్రంలో సీఎం చంద్రబాబు సారథ్యం లో ప్రజా పాలన మొదలైందని పుంగనూరు నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జ్ చల్లా రామచంద్రారెడ్డి తెలిపారు. పులిచెర్ల మండలం రాయవారిపల్లి సచివాలయాన్ని సోమవారం ఆయన సందర్శించారు. సచివాలయం వద్దకు చేరుకున్న ఆయనకు టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. తెలుగు మహిళలు కర్పూర హారతులిచ్చారు. అనంతరం సచివాలయాన్ని సందర్శించి ఉద్యోగులతో చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పుంగనూరు నియోజకవర్గం అభివృద్దే తన ముందున్న లక్ష్యమన్నారు. మెగా డీఎస్సీ, అన్నా క్యాంటీన్లు, రూ: 4వేల పింఛను పెంపు, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దుపై సీఎం చంద్రబాబు సంతకాలు చేయడంతోనే అభివృద్ధి ప్రారంభమైందన్నారు. నియోజకవర్గంలో ఇకపై రౌడీయిజానికి తావుండదని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు మునికృష్ణమనాయుడు, సింధురవి, టీడీపీ నాయకులు రామనాథంనాయుడు, గోవిందయ్య, శ్రీనివాసులురెడ్డి, నాగరాజనాయుడు, గోపినాయుడు, మోహన్‌నాయుడు, మురళీధర్‌నాయుడు, నూర్‌బాషా, రాజేష్‌నాయుడు, రాజగోపాల్‌నాయుడు, దేవ, పార్థసారథినాయుడు, లోకేష్, పురుషోత్తంనాయుడు, నరసింహులు, రామ్మూర్తి, గోపాల్, గురప్ప, సుధాకర్‌రెడ్డి, హరి, ఆనందరెడ్డి, రమణ, సుబ్బారెడ్డి, సురేంద్ర, భాస్కర్, వెంకట్రామానాయుడు, రవిమోహన్‌నాయుడు, నరేంద్రనాయుడు, మోహన్‌దాస్, భాస్కర్, వెంకటేష్, ఖాదర్‌వలి పాల్గొన్నారు.

పాలేటమ్మకు దీలు..బోనాల సమర్పణ



అమ్మవారికి సమర్పించేందుకు బోనాలతో వెళ్తున్న భక్తులు

సోమల, జూన్ 24: మండలంలోని కందూరు సమీపంలో కొలువుదీరిన పాలేటమ్మ వారి ఆలయ జాతర సందర్భంగా పలు గ్రామాల మహిళలు అమ్మవారికి ఆదివారం రాత్రి భక్తిశ్రద్ధలతో దీలు, బోనాలు సమర్పించారు. అమ్మవారి ఉత్సవమూర్తికి విశేష అలంకరణలు చేసి పల్లకీలో ఊరేగించారు. ఇంటింటా మహిళలు కర్పూరనీరాజనాలతో అమ్మవారిని దర్శించుకున్నారు. సోమవారం ఉదయం బలిపోతును బలిదానం చేశారు. పగడాలవారిపల్లె, బాలప్పగారిపల్లె, మిట్టపల్లె, వల్లిగట్ల, గల్లావారిపల్లె, తుదుంవారిపల్లె, అగ్రహారంపల్లె, కామిరెడ్డివారిపల్లె తదితర గ్రామాల భక్తులు జాతరలో పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో వెంకటమునిరెడ్డి

పుంగనూరు రూరల్, జూన్24: గ్రామీణ ప్రాంతాల్లో సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీవో వెంకటమునిరెడ్డి సూచించారు. సోమవారం ఆంధ్రజ్యోతిలో 'ప్రసన్నయ్యగారిపల్లెలో లోపించిన పారిశుధ్యం' అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. స్పందించిన ఎంపీడీవో సోమవారం తన కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అధికారులు, ఐసీడీఎస్, వైద్యం తదితర శాఖల అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాల వల్ల నీరు నిల్వ నిలచి దోమలు వృద్ధి చెంది అంటురోగాలు ప్రబలే అవకాశాలు ఉన్నాయన్నారు. అధికారులు గ్రామాల్లో పర్యటించి వ్యాధులు వ్యాప్తి చెందకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుదల కోసం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

అతిసార పట్ల అప్రమత్తంగా ఉండాలి

సదుం, జూన్ 24: ప్రస్తుత వర్షాకాలంలో అతిసార పట్ల వైద్య, ఆరోగ్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని చెరుకువారిపల్లె పీహెచ్‌సీ వైద్యాధికారి డా.గిరీషా సూచించారు. సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో అతిసార నియంత్రణ, ముందస్తు జాగ్రత్తలపై సిబ్బందికి అవగాహన కార్యక్రమం జరిగింది. 'స్టాప్ డయేరియా' ప్రత్యేక క్యాంపెయిన్ నిర్వహణపై సిబ్బందికి అవగాహన కల్పించారు. ఆయా గ్రామ ఆరోగ్య, ఆశా కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి డయేరియా లక్షణాలు గుర్తించాలని సూచించారు. సచివాలయ, ఆరోగ్య సిబ్బంది డయేరియా పట్ల ముందస్తు జాగ్రత్తలపై గ్రామాల్లో అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రాజశేఖర్, ఆరోగ్య పర్యవేక్షకులు ఉదయ భాస్కర్, నీలకంఠ, సచివాలయ వైద్య ఆరోగ్య, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

పలమనేరు
కుప్పం/పుంగనూరు

టీడీపీ ఫ్లెక్సీల చింపివేత



చౌడేపల్లె, జూన్24: పెద్దూరు గ్రామంలో గుర్తుతెలియని వైసీపీ కార్యకర్తలు ఆదివారం రాత్రి టీడీపీ ఫ్లెక్సీలు చింపేశారని టీడీపీ నాయకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. టీడీపీ మండలాధ్యక్షులు గువ్వల రమేష్‌రెడ్డి మాట్లాడుతూ నిందితులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ సీసీ పుటేజీల ఆధారంగా నిందితులను గుర్తించి చర్యలు తీసుకుంటామన్నారు.

పాము కాటుతో రైతుకు అస్వస్థత

పుంగనూరు రూరల్, జూన్24: పాము కాటు రైతు అస్వస్థతకు గురయ్యాడు. ఈ సంఘటన సోమవారం పుంగనూరులో చోటుచేసుకుంది. పట్టణ సమీపంలోని చెంగలాపురానికి చెందిన ప్రసాద్(42) పొలంలో పనులు చేస్తుండగా పాము కాటు వేసింది. స్థానికులు వెంటనే పుంగనూరు ఆస్పత్రికి తీసుకెళ్లారు. అయితే అతని పరిస్థితి ఆందోళనకరంగాగా ఉండడంతో మదనపల్లె ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ప్రభుత్వ కార్యాలయాలకు సోలార్ ప్యానెల్స్

సోమల, జూన్ 24: ప్రభుత్వ కార్యాలయాలకు సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేయాలని సీఎండీ ఆదేశాలు జారీ చేసినట్లు ట్రాన్స్‌కో ఏఈ మహేంద్రరెడ్డి తెలిపారు. మండల కార్యాలయాలు, సచివాలయాలు, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, ఆర్బీకే, ఆయా శాఖల అధికారులు సోలాలు ప్యానెల్స్ ఏర్పాటు కోసం తమ కార్యాలయాల కొలతలు మంగళవారం సాయంత్ర లోపు అందజేయాలని కోరారు.

డయేరియా నిర్మూలనకు చర్యలు చేపట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో సురేష్‌బాబు

కల్లూరు, జూన్ 24: డయేరియా నిర్మూలనకు ముందస్తు చర్యలు చేపట్టాలని తహసీల్దార్ వసంతలత, ఎంపీడీవో సురేష్‌బాబు, వైద్యాధికారులు జానకీరావు, యల్లయ్య, షమామరెహ్మాన్ తెలిపారు. పులిచెర్ల ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం డయేరియా నిర్మూలనపై ముందుస్తు చర్యల్లో భాగంగా మండల టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ మురుగునీరు నిల్వ లేకుండా, దోమలు వృద్ధి చెందకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. ప్రతి కుటుంబానికీ ఓఆర్ఎస్, జింక్ ప్రాముఖ్యత గురించి అవగాహన కల్పించాలన్నారు. అంగన్వాడీ కార్యకర్తలు, ఆశావర్కర్లు, వైద్య సిబ్బంది గ్రామాల్లో పర్యటించి డయేరియా నిర్మూలనపై అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏవో సుగుణమ్మ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమాదేవి, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ గౌతమి, పంచాయతీ కార్యదర్శులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రతి ఒక్కరూ పనిచేయాలి

రొంపిచెర్ల, జూన్24: పుంగనూరు నియోజకవర్గంలోని పేద ప్రజలు, రైతుల సమస్యల పరిష్కారానికి ప్రతి ఒక్కరూ పనిచేయాలని నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి చల్లారామచంద్రారెడ్డి కోరారు. సోమవారం నియోజకర్గంలోని ఉపాధి, ఇంజనీరింగ్, సచివాలయాల సిబ్బందితో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వానికి చెడ్డపేరు తేకుండా పనిచేయాలని సూచించారు. సంక్షేమ ఫలాలు అందరికీ అందించాలని సూచించారు. అనంతరం ఆయన్ను పూలమాలలు, శాలువలు, పుష్పగుచ్ఛాలతో సత్కరించారు.

కుప్పం ఆర్టీసీకి పూర్వ వైభవం

- డిపోకు చేరిన 38 సర్వీసులు
- చంద్రబాబుకు పాలాభిషేకం



చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ఎన్ఎంయూ నేతలు

కుప్పం, జూన్ 24: కుప్పం ఆర్టీసీ డిపో పూర్వ వైభవాన్ని సంతరించుకుంది. స్థానిక ఎమ్మెల్యే చంద్రబాబు ముఖ్యమంత్రి పీఠాన్ని అధిరోహించిన నేపథ్యంలో 38 బస్సు సర్వీసులను సోమవారం ఉన్నతాధికారులు వెనక్కు తెప్పించారు. కుప్పం ఆర్టీసీ డిపోలో 98 బస్సు సర్వీసులు నడిచేవి. అయితే వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత అందులోంచి 38 సర్వీసులను, సిబ్బందితో సహా తిరుమల, అలిపిరి, పుంగనూరు, పలమనేరు డిపోలకు తరలించారు. కుప్పం ఆర్టీసీకి డొక్కు బస్సులే మిగిలాయి. చాలా రూట్లలో బస్సు సర్వీసులను అధికారులు రద్దు చేశారు. ఉన్న కొద్దిపాటు డొక్కు సర్వీసులతో ప్రయాణికులు, ముఖ్యంగా విద్యార్థులు నానా అవస్థల పాలయ్యారు. చంద్రబాబు ముఖ్యమంత్రి కాగానే ఇతర డిపోలకు తరలివెళ్లిన బస్సు సర్వీసులను వెనక్కు తెప్పించే ప్రక్రియ ప్రారంభమైంది. అలా మొత్తం 38 సర్వీసులు తిరిగి సోమవారం కుప్పం డిపోకు చేరాయి. ఈ బస్సులో పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్‌లతోపాటు లగ్జరీ, సూపర్ లగ్జరీ బస్సులు ఉన్నాయి. ఈ సందర్భంగా ఆర్టీసీ ఎన్ఎంయూఏ నేతలు, టీడీపీ నాయకులు సంయుక్తంగా డిపో ఆవరణలో చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎంయూఏ జిల్లా అధ్యక్షుడు ఎ.వేలు, జె.శ్రీను, డిపో చైర్మన్ బొట్టు మణి, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎంజీ.ప్రసాద్, డిపో కార్యదర్శి జయపాల్, సంయుక్త కార్యదర్శి జి.మునెప్ప, గ్యారేజ్ కార్యదర్శి రహంతుల్లా, సహాయ కార్యదర్శి నారాయణ, శ్రీనివాసులు, బాలసుబ్రహ్మం, జగ్గయ్య, ప్రసాద్, తెలుగుదేశం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అందరికీ అండగా కూటమి ప్రభుత్వం

రామకుప్పం, జూన్ 24: కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు అండగా నిలుస్తుందని టీడీపీ రాష్ట్ర ఎస్సీసెల్ ఉపాధ్యక్షుడు మునస్వామి, బీసీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి పట్రు నారాయణాచారి, పార్టీ మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఆనందరెడ్డి, నరసింహులు, మాజీ ఎంపీపీ ఆంజినేయరెడ్డిలు తెలిపారు. రాష్ట్రంలో టీడీపీ కూటమి విజయం సాధించి చంద్రబాబు సీఎం కావడంతో సోమవారం రామకుప్పంలోని అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో స్థానిక పూలవ్యాపారులు ప్రత్యేక అభిషేకపూజలు నిర్వహించారు. ఆలయం ఎదుట 101కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం నాయకులను వ్యాపారులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి రాజసింహా, మండల అధ్యక్షుడు వెంకటేశ్, జనసేన మండల అధ్యక్షుడు హరీష్, టీడీపీ నాయకులు రామ్మూర్తి, సీతాపతి తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సమస్యలు వెంటనే పరిష్కరించాలి

పుంగనూరు రూరల్, జూన్24: ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వచ్చిన అర్జీలను వెంటనే పరిష్కరించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని డీటీ తాసీనాబేగం తెలిపారు. ఈ మేరకు సోమవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశాలు జారీచేశారని వివరించారు.

కుమార్తె ప్రేమ వివాహం.. తల్లిదండ్రుల ఆందోళన



పోలీస్‌స్టేషన్ ముందు నిరసన తెలుపుతున్న తల్లిదండ్రులు

పుంగనూరు రూరల్, జూన్ 24: ఒక్కగానొక్క బిడ్డ ప్రేమ వివాహం చేసుకొంది. తమ కుమార్తెను తమకు అప్పగించాలని పోలీసు స్టేషన్ ఎదుట తల్లిదండ్రులు ఆందోళనకు దిగారు. ఈ ఘటన సోమ వారం రాత్రి పుంగనూరులో జరిగింది. మండలంలోని పాళ్యంపల్లెకు చెందిన రమణప్ప, జ్యోతిదంపతుల ఏకైక కుమార్తె భావనశ్రీ (20). తిరుపతిలో చదువుకుంటున్న ఈమె.. అదే గ్రామానికి చెందిన మహేశ్‌రెడ్డి ప్రేమించుకుంటున్నారు. రెండు నెలల కిందట ఆమె స్వగ్రామానికి వచ్చింది. ఈ నేపథ్యంలో సోమవారం ఉదయం ప్రేమికులు ఇంటినుంచి వెళ్లిపోయి పెళ్లి చేసుకున్నారు. రక్షణ కోసం పలమనేరు డీఎస్పీ విష్ణురఘువీర్‌ను ఆశ్రయించారు. వీళ్ల మేజర్లు కావడంతో పుంగనూరు పోలీసులకు డీఎస్పీ సమాచారం ఇచ్చారు. పోలీసుల సమాచారంతో రమణప్ప, జ్యోతి తమ బంధువులతో కలసి పుంగనూరు పోలీస్‌స్టేషన్ చేరుకున్నారు. తమ కుమార్తెను తమకు అప్పగించాలని కోరారు. మేజర్లు కావడంతో పోలీసులు అందుకు నిరాకరించారు. దీంతో తమ కుమార్తెను పంపని పక్షంలో పెంట్రోల్ పోసుకుని ఆత్మహత్య చేసుకుంటామని స్టేషన్ ముందు భైఠాయించారు. దీంతో కొంత సమయం ఉద్రిక్తత నెలకొంది. పలమనేరు డీఎస్పీ వెంటనే పుంగనూరుకు చేరుకుని యువతి తల్లిదండ్రులతో మాట్లాడారు. ఆందోళన విరమింపజేశారు.

చంద్రబాబు రాకతో పటిష్ట ఏర్పాట్లు



చిన్నారిదొడ్డి సమీపంలో రోడ్డు పక్కన శుభ్రం చేస్తున్న అధికారులు

శాంతిపురం, జూన్ 24 : ముఖ్యమంత్రి చంద్రబాబు కుప్పం నియోజకవర్గ పర్యటనకు అధికారులు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. ఆ ఏర్పాట్లను కలెక్టర్ సుమిత్‌కుమారు సోమవారం పరిశీలించారు. సీఎం పర్యటించే గ్రామాల వద్ద మండల పరిషత్ అధికారులు పారిశుధ్య పనులు చేపట్టారు. ఆర్ అండ్ బీ అధికారులు రోడ్డు వెంబడి శుభ్రం చేయించారు. అక్కడక్కడా గుంతలు పడ్డ రోడ్లుకు మరమ్మతులు చేశారు. జల్లిగానిపల్లె, చిన్నారిదొడ్డి హంద్రీ నీవా కాలువ వద్ద బారికేడ్లు కట్టి పోలీసులు ఆధీనంలోకి తీసుకున్నారు. కాగా అధినేత రాకతో కడపల్లె, శివపురం, కనమలదొడ్డి, కర్లగట్ట, జల్లిగానిపల్లె, బారామతి ఫ్యాక్టరీ, చిన్నారిదొడ్డి, నడింపల్లె, తుమ్మిశి, దుంకుమానుపల్లె, తుమ్మిశి రోడ్డు గ్రామాల వద్ద తెలుగు తమ్ముళ్ల పసుపు జెండాలతో నింపేశారు. పల్లెలన్నీ పసుపు మయంగా మారాయి.

సీఎం సభకు తరలిరండి

శాంతిపురం, జూన్ 24 ముఖ్యమంత్రి చంద్రబాబు బహిరంగ సభకు మహిళలు తరలిరావాలని మండల టీడీపీ అధ్యక్షుడు భాష్యం విశ్వనాథనాయుడు కోరారు. సోమవారం వెలుగు కార్యాలయంలో వెలుగు సిబ్బందితో టీడీపీ నాయకులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ బస్సు సౌకర్యం ఉంటుందని వాటి బాధ్యత సంఘమిత్రలు చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఉదయకుమార్, విజయరామిరెడ్డి, నారాయణరెడ్డి, ఆంజనేయరెడ్డి, చంద్రశేఖర్, నాగరాజు, శ్యామల తదితరులు పాల్గొన్నారు.

గౌరవ సభగా మారిన అసెంబ్లీ



మాట్లాడుతున్న ఖాదర్‌బాషా తదితరులు

కుప్పం, జూన్ 24: శపథం చేసినట్లే ముఖ్యమంత్రిగా చంద్రబాబు మళ్లీ అసెంబ్లీలో అడుగుపెట్టి కౌరవసభను గౌరవసభగా మార్చారని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి గాజుల ఖాదర్‌బాషా అన్నారు. కుప్పంలో ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ చంద్రబాబు వజ్రం వంటివారని, ఆయన ఆధ్వర్యంలో రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి చెందుతుందని చెప్పారు. కుప్పంలో చంద్రబాబు గెలిస్తే ఆయన బూట్లు తుడుస్తానని సవాల్ విసిరిన మాజీ మంత్రి కొడాలి నాని ఎక్కడున్నాడో తెలియడంలేదని ఎద్దేవా చేశారు. జగన్మోహన్‌రెడ్డి చేసిన పాపాలు పండినందువల్లే ప్రజలు ఆయన రాక్షస పాలనను తిరస్కరించారన్నారు. ఈ సమావేశంలో కుప్పం నియోజకవర్గ మైనారిటీ సెల్ అధ్యక్షుడు జాకీర్, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ సత్యేంద్రశేఖర్, తెలుగు మహిళా నాయకురాలు చంద్రకళ, మైనారిటీ నాయకులు సర్దార్‌బాషా, ఫైరోజ్, అన్సర్, ముజీబ్ తదితరులు పాల్గొన్నారు.

అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థినులకు సన్మానం

పలమనేరు, జూన్24 : పలమనేరు బాలికోన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన అమూల్య (577), భానుశ్రీ (560), తబుసమ్(559)లను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా బాలికోన్నత పాఠశాలలో సోమవారం విద్యార్థినులతో సమావేశం నిర్వహించి అత్యధిక మార్కులు సాధించిన ముగ్గురికీ శాలువలు కప్పి, పుష్పగుచ్చాలు, నగదు ప్రోత్సాహకాలను అందజేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో స్థానిక శాఖా గ్రంథాలయ అధికారి హేమంతకుమార్, యోగా గురువు నందగోపాల్, సామాజిక కార్యకర్త మధుసూదన్‌రావు, హెచ్ఎం లత, టీచర్లు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

దారికి అడ్డుగా ట్రెంచ్.. తహసీల్దార్‌కు ఫిర్యాదు



శాంతిపురం, జూన్ 24 : పదిమందికీ ఉపయోగపడే దారిలో కాలువ తవ్వేసి ప్రజలను ఇబ్బంది పెడుతున్న వైసీపీ నాయకుడిపై చర్యలు తీసుకోవాలని చెంగుబల్ల పంచాయతీ మాజీ సర్పంచ్ గోపాల్ కోరారు. ఈ మేరకు సోమవారం తహసీల్దార్ మురళీకృష్ణకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోగడబల్ల పెద చెరువు ఆక్రమణలను అధికారులు శనివారం తొలగించారన్నారు. ఇందులో భాగంగా చెరువులోని బోయకొండ గంగమ్మ ఆలయంలో పూజలు చేసుకుని అక్కడే జీవనం సాగిస్తున్న చలపతి కుటుంబానికి చెందిన పూరిగుడిసెను అధికారులు తొలగించారని పేర్కొన్నారు. అయితే పక్కనే వైసీపీ నాయకుడి పశువుల షెడ్డును తొలగించలేదని తెలిపారు. అయితే ఆక్రమణదారుడు తన ఆధీనంలోని చెరువులోని ఆక్రమణలకు అధికారులు ట్రెంచ్ కొట్టడాన్ని జీర్ణించుకోలేక వలంటీర్‌తో కలిసి పొలాలకు, ఆలయానికి వెళ్లె రహదారిలో ఆదివారం ట్రెంచ్ కొట్టేశాడని వాపోయాడు. అధికారులు స్పందించి ఆలయానికి, పొలాలకు వెళ్లే దారిని పునరుద్ధరించాలని కోరారు.

నాయకుల విగ్రహాలను యథాస్థానంలో ఉంచాలి

పుంగనూరు రూరల్, జూన్24: పట్టణంలోని ఇందిరా సర్కిల్లో గతంలో ఉన్న నాయకుల విగ్రహాలను యథాస్థానంలో ఉంచాలని బీజేపీ నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం మున్సిపల్ కమిషనర్ నరసింహప్రసాద్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జ్యోతిరావుపూలే, తెలుగుతల్లి, వాల్మీకి మహర్షి విగ్రహాలను రోడ్డు విస్తరణ సమయంలో తొలగించి వేరొక చోట ఉంచారని గుర్తుచేశారు. రోడ్డు పనులు పూర్తయినా విగ్రహాలను యథాస్థానంలో ఏర్పాటు చేయలేదని తెలియజేశారు. బీజేపీ నాయకులు అయూబ్‌ఖాన్, పెద్దమఠం బాబు, మల్లికారాణి, రాజ పాల్గొన్నారు.

ముత్యాల పల్లకిలో సల్లాపురమ్మ విహారం

గుడుపల్లె, జూన్ 24: ముత్యాల పల్లకిలో సల్లాపురమ్మ సోమవారం విహరించి భక్తులను అనుగ్రహించారు. కంచుబందార్లపల్లె గుండ్లసాగరంలోని సల్లాపురమ్మ ఆలయ వార్షిక ఉత్సవాల్లో భాగంగా ఉదయం అమ్మవారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి వేద పండితులు శాస్త్రోక్తంగా ప్రత్యేక అభిషేకాలు, విశేషంగా పూజలు చేసి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని పట్టువస్త్రాలు, ఆభరణాలు, వివిధ రకాల పుష్పాలతో అలంకరించి ముత్యాల పల్లకిపై కొలువు దీర్చారు. మంగళవాయిద్యాలు, కోలాటాల నడుమ గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. మహిళలు అమ్మవారికి కొబ్బరికాయలు కొట్టి కర్పూర హారతులు పట్టారు. పరిసర గ్రామాల నుంచి భక్తులు తరలి వచ్చారు. ఆలయ కమిటీ వారు భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

పాఠకులకు ముఖ్యగమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

వరసిద్ధుడి సేవలో కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి


న్యాయమూర్తికి జ్ఞాపికను అందిస్తున్న ఏఈవో విద్యాసాగర్‌రెడ్డి

ఐరాల(కాణిపాకం), జూన్ 24: కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామిని కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.నటరాజన్ సోమవారం దర్శించుకున్నారు. ఆయన్ను ఏఈవో విద్యాసాగర్‌రెడ్డి ఆలయ మర్యాదలతో ఆహ్వానించి స్వామి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. దర్శనానంతరం ఆయన్ను వేదమంత్రాలతో ఆశీర్వదించి స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు, జ్ఞాపికను అందించారు. ఆలయ సూపరింటెండెంట్ వాసు, ఇన్‌స్పెక్టర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

కణితి మాంసం స్వాధీనం

ఇద్దరి అరెస్టు, నాటు తుపాకి, బైక్ సీజ్



భాకరాపేట, జూన్ 24: కణితి మాంసం తరలిస్తుండగా ఇద్దరిని అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి కణితి మాంసంతోపాటు నాటు తుపాకి, ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నారు. భాకరాపేట ఫారెస్టు రేంజర్ దత్తాత్రేయ తెలిపిన వివరాల మేరకు.. వెదురుకుప్పం మండలం తిరుమలయ్యపల్లె షికారీ కాలనీకి చెందిన సురేశ్, శ్రీనివాసులు నాటు తుపాకీతో కణితిని కాల్చి మాంసం తీసుకొస్తుండగా భాకరాపేట బీట్ పరిధిలో అదుపులోకి తీసుకున్నారు. నిందితులను రిమాండుకు పంపారు. ఈ దాడుల్లో ఎఫ్ఎస్‌వో తౌఫిక్ ఇస్లాం, ఎఫ్‌బీవోలు సదాశివయ్య, లోకనాథం పాల్గొన్నారన్నారు.



మంత్రి లోకేశ్‌కి శ్రీవారి ప్రసాదాలు

చంద్రగిరి, జూన్ 24: వెలగపూడిలోని సచివాలయంలో మంత్రిగా సోమవారం బాధ్యతలు స్వీకరించిన నారా లోకేశ్‌ని చంద్రగిరి మండలానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వీరపల్లి హేమాంబరధరరావు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రికి శ్రీవారి తీర్థ ప్రసాదాలు అందజేసి, శుభాకాంక్షలు తెలిపారు.

ఆవుల దొంగకు ఆరునెలల జైలు, జరిమానా


శైలేష్

చిత్తూరు లీగల్, జూన్ 24: రెండు ఆవులను తీసుకెళ్లి గుట్టుచప్పుడు కాకుండా అమ్మేసిన నిందితుడికి చిత్తూరు న్యాయస్థానం ఆరునెలల జైలు శిక్షతో పాటు జరిమానా విధిస్తూ తీర్పు చెప్పింది. బంగారుపాళ్యం దళితవాడకు చెందిన మురళి తనకున్న రెండు ఆవులను మేపుకుంటూ కుటుంబాన్ని పోషించేవారు. ఈ క్రమంలో 2020 జూలై 26న ఈ ఆవులను బంగారుపాళ్యం మండలం ముత్తుబంగారునగర్ కాలనీలోని శైలేష్ తీసుకెళ్లి అమ్మేశాడు. బంగారుపాళ్యం పోలీసులు శైలేష్‌పై కేసు నమోదుచేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసు సోమవారం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో వాయిదా ఉండగా, శైలేష్‌పై నేరం రుజువుకావడంతో అతడికి ఆరునెలల జైలు శిక్ష, రూ.10వేలు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి ఉమాదేవి తీర్పు చెప్పారు. ఈ కేసును ఏపీపీ కృష్ణారెడ్డి వాదించారు.

టమోటా తోటల్లో దొంగలు పడ్డారు

సోమల, జూన్ 24: టమోటాకు గిట్టుబాటు ధరలు ఉండడంతో చిల్లర దొంగలు తోటల్లో పడ్డారు. టమోటాలను కోసుకెళుతున్నారు. ఆదివారం రాత్రి సోమల- సదుం మార్గం అభయాంజనేయస్వామి ఆలయం సమీప బాయిగడ్డ నరసింహులు పొలంలోని టమోటా తోటలో కోతకు సిద్ధంగా ఉన్న 50 బాక్సుల టమోటాలను కోసుకెళ్లారు. నరసింహులుకు చెందిన రెండు ఎకరాలను కలకడకు చెందిన మురళి లీజుకు తీసుకుని టమోటా సాగు చేశారు. రైతులు పొలం వద్ద ఉన్నప్పటికీ రాత్రి కురిసిన వర్షానికి ఇంటి రావడంతో టమోటాలు చోరీ జరిగింది. చిన్న సోమల మార్గంలోని పలు తోటల్లో టమోటాలు చోరీలు జరుగుతున్నట్లు రైతులు తెలిపారు. 15 కిలోల బాక్సు రూ.800 వరకు పలకడంతో చిల్లర దొంగలు చోరీలకు పాల్పడుతున్నారు. కొందరు రైతులు పొలాల వద్ద విద్యుత్ లైట్లు ఏర్పాటు చేసి అక్కడే కాపు కాస్తున్నారు. కొంత ఆదమరిస్తే దుండగులు టమోటాలను కోసుకెళుతున్నారు.



కుప్పం అర్బన్ సీఐగా జీటీ నాయుడు

కుప్పం, జూన్ 24: కుప్పం అర్బన్ సీఐగా జీటీ నాయుడు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అలాగే, రూరల్ సీఐగా మల్లేష్ యాదవ్ నియమితులయ్యారు. ఇంతకుముందు ఇక్కడ పనిచేస్తున్న అర్బన్, రూరల్ సీఐలు రమణ, ఈశ్వర్‌రెడ్డిని అనంతపురం వీఆర్‌కు పంపిన విషయం తెలిసిందే.

కుమార్తె ప్రేమ వివాహం.. తల్లిదండ్రుల ఆందోళన


పోలీస్‌స్టేషన్ ముందు కుటుంబీకుల నిరసన

పుంగనూరు రూరల్, జూన్ 24: ఒక్కగానొక్క బిడ్డ ప్రేమ వివాహం చేసుకొంది. తమ కుమార్తెను తమకు అప్పగించాలని పోలీసు స్టేషన్ ఎదుట తల్లిదండ్రులు ఆందోళనకు దిగారు. ఈ ఘటన సోమవారం రాత్రి పుంగనూరులో జరిగింది. మండలంలోని పాళ్యంపల్లెకు చెందిన రమణప్ప, జ్యోతిదంపతుల ఏకైక కుమార్తె భావనశ్రీ (20). తిరుపతిలో చదువుకుంటున్న ఈమె.. అదే గ్రామానికి చెందిన మహేశ్‌రెడ్డి ప్రేమించుకుంటున్నారు. రెండు నెలల కిందట ఆమె స్వగ్రామానికి వచ్చింది. ఈ నేపథ్యంలో సోమవారం ఉదయం ప్రేమికులు ఇంటినుంచి వెళ్లిపోయి పెళ్లి చేసుకున్నారు. రక్షణ కోసం పలమనేరు డీఎస్పీ విష్ణురఘువీర్‌ను ఆశ్రయించారు. వీళ్లు మేజర్లు కావడంతో పుంగనూరు పోలీసులకు డీఎస్పీ సమాచారం ఇచ్చారు. పోలీసుల సమాచారంతో రమణప్ప, జ్యోతి తమ బంధువులతో కలసి పుంగనూరు పోలీస్‌స్టేషన్ చేరుకున్నారు. తమ కుమార్తెను తమకు అప్పగించాలని కోరారు. మేజర్లు కావడంతో పోలీసులు అందుకు నిరాకరించారు. దీంతో తమ కుమార్తెను పంపని పక్షంలో పెట్రోల్ పోసుకుని ఆత్మహత్య చేసుకుంటామని స్టేషన్ ముందు బైఠాయించారు. దీంతో కొంత సమయం ఉద్రిక్తత నెలకొంది. పలమనేరు డీఎస్పీ వెంటనే పుంగనూరుకు చేరుకుని యువతి తల్లిదండ్రులతో మాట్లాడి ఆందోళన విరమింపజేశారు.

బర్డ్‌లో నిలిచిన ఉచిత మోకాళ్ల మార్పిడి శస్త్ర చికిత్సలు

తిరుపతి(వైద్యం), జూన్ 24: టీటీడీ ఆధ్వర్యంలో నడుస్తున్న బర్డ్ ఆస్పత్రిలో ఈనెల ఒకటో తేదీనుంచి ఉచిత మోకాళ్ల మార్పిడి శస్త్ర చికిత్సలు నిలిపేయడంతో రోగులు ఇబ్బందులకు గురవుతున్నారు. బర్డ్ ప్రత్యేకాధికారిగా గతంలో పనిచేస్తున్న డాక్టర్ రాచపల్లి రెడ్డెప్పరెడ్డి గత నెల 31వ తేదీన తన పదవికి రాజీనామా చేశారు. మరుసటి రోజునే ఆయన స్థానంలో ఆర్ఎంవో డాక్టర్ కిశోర్‌కుమార్‌ని ఇన్‌చార్జిగా టీటీడీ నియమించింది. ఆయన బాధ్యతలు చేపట్టిన రోజు నుంచే ఈ శస్త్ర చికిత్సలను నిలిపేశారు. కేవలం నగదు చెల్లించిన వారికి మాత్రమే శస్త్ర చికిత్సలు చేస్తున్నారు. వీటిల్లో మోకాళ్ల మార్పిడి శస్త్ర చికిత్స తర్వాత అమర్చే ఇంప్లాంట్ సాధారణమైనది రూ.72వేలు, నాణ్యమైనదైతే రూ.1.35 లక్షలు చెల్లించాలి. మూడు వారాల వ్యవధిలో దాదాపు 70కిపైగా మోకాళ్ల మార్పిడి శస్త్ర చికిత్సలు చేశారు. వీటిల్లో అన్నీ నగదు చెల్లించిన వారికి మాత్రమే చేయడం విశేషం. ఇక గత ప్రభుత్వ హయాంలో సిఫారసులున్న వారికే శస్త్ర చికిత్సలు చేసేవారు. తాజాగా ఉచిత శస్త్ర చికిత్సలు పూర్తిగా ఆపేయడంతో నిరుపేద రోగులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయంపై బర్డ్ ఇన్‌చార్జి ప్రత్యేకాధికారి, ఆర్ఎంవో కిశోర్‌కుమార్‌ను వివరణ కోరగా.. రెగ్యులర్ డైరెక్టరు లేనందున ఉచిత శస్త్ర చికిత్సలు చేయడం లేదని చెప్పారు. కేవలం నగదు చెల్లించిన వారికి మాత్రమే చేస్తున్నామన్నారు. రెగ్యులర్ డైరెక్టరును నియమించే వరకు ఇదే పరిస్థితి ఉంటుందని తెలిపారు.

శ్రీవారి ట్రస్టులకు రూ.20 లక్షల విరాళం



తిరుమల, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ట్రస్టులకు సోమవారం రూ.20లక్షలు విరాళంగా అందాయి. జార్ఖండ్‌కు చెందిన సరళా ఇంజనీరింగ్ లిమిటెడ్ ఈ విరాళాలను అందజేసింది. ఎస్వీబీసీ ట్రస్టుకు రూ.10 లక్షలు, ఎస్వీ అన్నప్రసాదం ట్రస్టుకు రూ.10 లక్షలు అందజేశారు. ఈమేరకు సంస్థ ప్రతినిధి తిరుపతికి చెందిన రాఘవేంద్ర సోమవారం తిరుమలలోని గోకులం విశ్రాంతి గృహంలో ఈవో శ్యామలరావుకు డీడీలను అందజేశారు.

పసుపుమయం.. అధికారుల దళం

కుప్పంలో సీఎం పర్యటన ఏర్పాట్లు పూర్తి




కుప్పంలో వెలసిన స్వాగత బ్యానర్లు, ఎన్టీఆర్ విగ్రహం ఎదుట ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎస్పీ మణికంఠ తదితరులు

కుప్పం, జూన్ 24: ముఖ్యమంత్రి చంద్రబాబు కుప్పం పర్యటన ఏర్పాట్లు సోమవారం రాత్రికి పూర్తయ్యాయి. వారం రోజులుగా జిల్లా.. స్థానిక అధికార యంత్రాంగం కూడా కుప్పంలోనే ఉండి, ఏర్పాట్లను పర్యవేక్షిస్తోంది. మరోవైపు టీడీపీ శ్రేణులు కుప్పాన్ని పసుపుమయం చేశాయి. ఆదివారందాకా అప్పటి కలెక్టర్ షన్మోహన్.. సోమవారం మధ్యాహ్నం నుంచి కొత్త కలెక్టరు సుమిత్‌కుమార్ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. ఎస్పీ మణికంఠ ఆధ్వర్యంలో భద్రతా చర్యలు చేపట్టారు. సోమవారం రాత్రికి కుప్పం చేరుకున్న ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ అధికారులతో సమన్వయం చేసుకుని సీఎం పర్యటన ఏర్పాట్లను పర్యవేక్షించారు. పీఈఎస్ వైద్య కళాశాల మైదానంలో హెలిప్యాడ్ సిద్ధం చేశారు. బహిరంగ సభ కోసం ఎన్టీఆర్ విగ్రహం ఎదుట ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్ వద్ద వినతుల స్వీకరణకు పటిష్ఠమైన బ్యారికేడింగ్ నిర్మించారు. కాగా, సీఎం చంద్రబాబు పర్యటించే ప్రాంతాలను సోమవారం అధికారులు పరిశీలించారు. మరోవైపు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అదనపు పోలీసు బలగాలు కుప్పంలో మోహరించాయి. సీఎం పర్యన షెడ్యూల్ ఉన్న ప్రతి చోటా ప్రభుత్వాధికారులను ఇన్‌చార్జిలుగా నియమించారు. మరోవైపు చంద్రబాబు పర్యటన నేపథ్యంలో టీడీపీ శ్రేణులు కుప్పం పట్టణాన్ని పసుపుమయం చేశాయి. అధినేతకు స్వాగతం పలుకుతూ అడుగడుగునా ఫ్లెక్సీలు, బ్యానర్లు వెలిశాయి.

చేరికలు ఉండవు

ముఖ్యమంత్రి చంద్రబాబు రాక సందర్భంగా వైసీపీనుంచి టీడీపీలోకి ఎటువంటి చేరికలు ఉండబోవని ఎమ్మెల్సీ శ్రీకాంత్ 'ఆంధ్రజ్యోతి'కి స్పష్టం చేశారు. పలువురు కౌన్సిలర్లు, జడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు వైసీపీనుంచి టీడీపీలో చేరనున్నారన్న ప్రచారం సామాజిక మాధ్యమాల్లో సోమవారం హల్‌చల్ చేసింది. దీనిపై ఆయన స్పందించారు. ప్రస్తుతానికి ఎటువంటి చేరికలు ఉండవని, అవి తప్పుడు ప్రచారాలని కొట్టేశారు. ఆ అవసరం తమకు లేదన్నారు. ఎన్నికల్లో చంద్రబాబు విజయంకోసం కష్టపడిన ప్రతి కార్యకర్తకు, నాయకుడికి సముచిత స్థానం లభిస్తుందని చెప్పారు.

చూసి.. మాట్లాడి.. వారంలో పరిష్కారం

బాధితుల ఎదుటే కింది స్థాయి అధికారులతో మాట్లాడిన కలెక్టర్


బాధితులతో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరు, జూన్ 24: కొత్తగా బాధ్యతలు తీసుకున్న కలెక్టర్ సుమిత్ కుమార్ అర్జీల పరిష్కారంలో కొత్త పంథాను ఎంచుకున్నారు. ఇది వరకు ఉన్న కలెక్టర్ బాధితులు తీసుకొచ్చిన అర్జీపై సంతకం చేసి.. ఆ శాఖ జిల్లా అధికారులకు ఇచ్చేవారు. ఆ అర్జీ తపాలా ద్వారా వారానికో.. పది రోజులకో ఆయా మండలాలకు వెళ్లేది. అప్పటికే స్థానిక అధికారుల ఒత్తిడి మేరకు సమస్యను పరిష్కరించి ఉండరు. కలెక్టరేట్ నుంచి వెళ్లిన అర్జీకి కూడా టెక్నికల్ సమస్యలను జోడించి జిల్లా అధికారులకు నివేదిక ఇచ్చేవారు. ఇలా ఏ సమస్య అయినా నెలలు.. సంవత్సరాలు గడిచినా పరిష్కారం అయ్యేది కాదు. సోమవారం బాధ్యతలు తీసుకున్న సుమిత్‌కుమార్ 'ప్రజా ఫిర్యాదులు- పరిష్కార వేదిక'కు కొత్త అర్థాన్ని తీసుకొచ్చారు. అర్జీని స్వీకరించిన వెంటనే కలెక్టర్ లేదా ఆ శాఖ జిల్లా అధికారి చేత ఫోన్ చేయించి సమస్యను చెప్పేవారు. ఆ సమస్య ఏ కారణంగా పెండింగ్‌లో ఉందో చెప్పాలని అడిగారు. బాధితుల సమస్యలను పరిష్కరించి వారికి ఉపశమనం కలిగించాలని కోరారు. ఇలా ఆయన సోమవారం కొన్ని అర్జీదారులతో మాట్లాడినప్పటికీ అందరికి వారం రోజుల్లో పరిష్కారం చూపుతానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమానికి మొత్తం వంద అర్జీలు అందాయి. వీటిలో రెవెన్యూశాఖకు 77, మున్సిపల్‌శాఖకు 10, నేషనల్ హైవేకు 2, బీసీ వెల్ఫేర్‌కు 2, డీపీవోకు 2, విభిన్న ప్రతిభావంతులశాఖ, ఆరోగ్యశ్రీ, ఎంప్లాయిమెంట్, ఎంపీడీవో 1, తదితర శాఖలకు ఒక్కో అర్జీ వంతున అందాయి. ఈ కార్యక్రమంలో డీఆర్వో పుల్లయ్య, డ్వామా పీడీ రాజశేఖర్‌తో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. కలెక్టరుకు అందిన సమస్యల్లో కొన్ని..

- చిత్తూరు నగరపాలక సంస్థలో 12 మంది దళిత డ్రైవర్లకు తొమ్మిది నెలల పాటు జీతాలు ఇవ్వకుండా అధికారులు వేధింపులకు గురిచేస్తున్నారని దళిత ప్రజా వేదిక నాయకులు ఆరోపించారు. సోమవారం కలెక్టర్‌కు ఫిర్యాదులతో కూడిన అర్జీని అందించారు. 2023 సెప్టెంబరు నెల నుంచి 12 మంది దళిత డ్రైవర్లు వివిధ వాహనాలను నడుపుతున్నారని తెలిపారు. వారికి ఇవ్వాల్సిన జీతభత్యాలను ఇవ్వకపోవడంతో కుటుంబాలు గడవటం కష్టంగా ఉందన్నారు. ఇదే విషయాన్ని కమిషనర్‌ను అడిగితే మీరు ఎవరో తనకు తెలియదని నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని పెండింగ్‌లో ఉన్న వేతనాలను ఇప్పించాలని ఆ సంఘ నేతలు రాజ్‌కుమార్, మునస్వామి, ధనంజయరావు, పార్థసారథి డిమాండ్ చేశారు.
- తన భూమిని ఆక్రమించుకోవడానికి కొందరు ప్రయత్నిస్తున్నారని చౌడేపల్లె మండలం బండమీదపల్లెకు చెందిన వెంకటరమణ దంపతులు సోమవారం కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందించారు. 1.10 ఎకరాల భూమి తన అనుభవంలో ఉందని, ఈ భూమిలో వచ్చే ఆదాయంతోనే కుటుంబం గడుస్తోందన్నారు. దాంతో కలెక్టర్ అక్కడి నుంచే నేరుగా తహసీల్దార్‌తో మాట్లాడారు. బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు.
- చివరి దశలో ఉన్న తమకు పెన్షన్‌ను మంజూరు చేయాలని చిత్తూరు నగరం తోటపాళ్యంకు చెందిన జయరాం కోరారు. పెన్షన్ కోసం ఐదేళ్లుగా తిరుగుతున్నా ప్రభుత్వం పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

50 ఏళ్ల ముందుచూపుతో కాణిపాకంలో ఏర్పాట్లు చేస్తాం

- సిబ్బంది యూనిఫాం, తిలక ధారణ చేసుకోవాలి
- ఉభయదారులు సహకరించాలి
- సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యే మురళీమోహన్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే మురళీమోహన్

ఐరాల(కాణిపాకం), జూన్ 24: కాణిపాక ఆలయంలో 50 సంవత్సరాల ముందు చూపుతో ఏర్పాట్లు చేస్తామని పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ అన్నారు. ఆలయ సమావేశ మందిరంలో సోమవారం ఈవో వెంకటేశు ఆధ్వర్యంలో ఆయన అధికారులు, ఉద్యోగులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆలయంలో పని చేసే ఉద్యోగులు, సిబ్బంది జూలై 15 నుంచి కచ్చితంగా యూనిఫాం ధరించాలన్నారు. తిలక ధారణ చేసుకోవాలని సూచించారు. ఆలయంలో ఆధ్యాత్మికత ఉట్టిపడేలా ప్రతి ఒక్కరు ప్రవర్తించాలన్నారు. భక్తులకు ఏదైనా అవసరం వచ్చి వారు సిబ్బందితో మాట్లాడితే దేవుడి ప్రతినిధితో మాట్లాడినట్లు సిబ్బంది ప్రవర్తన ఉండాలన్నారు. వరసిద్ధుడి ఆలయానికి చెందిన 14 గ్రామాల ఉభయదారులు అభివృద్ధి కోసం పూర్తి స్థాయిలో సహకరించాలని కోరారు. ఆలయ ఉభయదారుల గౌరవానికి ఎక్కడా భంగం కలగకుండా చూస్తానన్నారు. ఆలయ మాస్టర్ ప్లాన్ ప్రకారం చేపట్టాల్సిన కార్యక్రమాలను చేపడతామన్నారు. ఈ సమావేశంలో ఈఈ వెంకటనారాయణ, ఏఈవోలు ఎస్వీకృష్ణారెడ్డి, రవీంద్రబాబు, విద్యాసాగర్‌రెడ్డి, హరిమాధవరెడ్డి, ధనంజయ, మండల టీడీపీ అధ్యక్షుడు గిరిధర్‌బాబు, ఆలయ మాజీ చైర్మన్ మణినాయుడు, నాయకులు గంగారపుహరిబాబు నాయుడు, ఎంఎస్ చౌదరి, మధుసూదన్‌రావు, హేమాద్రినాయుడు, నరసింహులునాయుడు, విక్రం పాల్గొన్నారు.

కుప్పం ఆర్టీసీకి పూర్వ వైభవం

- డిపోకు చేరిన 38 సర్వీసులు
- చంద్రబాబుకు పాలాభిషేకం


చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ఎన్ఎంయూ నేతలు

కుప్పం, జూన్ 24: కుప్పం ఆర్టీసీ డిపో పూర్వ వైభవాన్ని సంతరించుకుంది. స్థానిక ఎమ్మెల్యే చంద్రబాబు ముఖ్యమంత్రి పీఠాన్ని అధిరోహించిన నేపథ్యంలో 38 బస్సు సర్వీసులను సోమవారం ఉన్నతాధికారులు వెనక్కు తెప్పించారు. కుప్పం ఆర్టీసీ డిపోలో 98 బస్సు సర్వీసులు నడిచేవి. అయితే వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత అందులోంచి 38 సర్వీసులను, సిబ్బందితో సహా తిరుమల, అలిపిరి, పుంగనూరు, పలమనేరు డిపోలకు తరలించారు. కుప్పం ఆర్టీసీకి డొక్కు బస్సులే మిగిలాయి. చాలా రూట్లలో బస్సు సర్వీసులను అధికారులు రద్దు చేశారు. ఉన్న కొద్దిపాటు డొక్కు సర్వీసులతో ప్రయాణికులు, ముఖ్యంగా విద్యార్థులు నానా అవస్థల పాలయ్యారు. చంద్రబాబు ముఖ్యమంత్రి కాగానే ఇతర డిపోలకు తరలివెళ్లిన బస్సు సర్వీసులను వెనక్కు తెప్పించే ప్రక్రియ ప్రారంభమైంది. అలా మొత్తం 38 సర్వీసులు తిరిగి సోమవారం కుప్పం డిపోకు చేరాయి. ఈ బస్సుల్లో పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్‌లతోపాటు లగ్జరీ, సూపర్ లగ్జరీ బస్సులు ఉన్నాయి. ఈ సందర్భంగా ఆర్టీసీ ఎన్ఎంయూఏ నేతలు, టీడీపీ నాయకులు సంయుక్తంగా డిపో ఆవరణలో చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎంయూఏ జిల్లా అధ్యక్షుడు ఎ.వేలు, జె.శ్రీను, డిపో చైర్మన్ బొట్టు మణి, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎంజీ.ప్రసాద్, డిపో కార్యదర్శి జయపాల్, సంయుక్త కార్యదర్శి జి.మునెప్ప, గ్యారేజ్ కార్యదర్శి రహంతుల్లా, సహాయ కార్యదర్శి నారాయణ, శ్రీనివాసులు, బాలసుబ్రహ్మం, జగ్గయ్య, ప్రసాద్, తెలుగుదేశం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రుయా డిప్యూటీ సీఎస్ ఆర్ఎంవోగా హనుమంతరావు

- ఏడు నెలలుగా సెలవులో ఉన్న అధికారిని నియమించడంపై విమర్శలు
- గతంలో పనిచేసిన శాఖలో రిలీవ్ కాకనే కొత్త పోస్టులో చేరడంపై చర్చ


హనుమంతరావు

తిరుపతి(వైద్యం), జూన్ 24 : రుయాస్పత్రిలో డిప్యూటీ సీఎస్ ఆర్ఎంవోగా డాక్టర్ సి.హనుమంతరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అయితే ఏడు నెలలుగా మెడికల్ లీవులో ఉన్న ఆయన తాను గతంలో పనిచేసే శాఖలో రిలీవ్ కాకుండానే ఏకంగా డిప్యూటీ సీఎస్ ఆర్ఎంవోగా బాధ్యతలు చేపట్టారన్న విమర్శలొస్తున్నాయి. ఆస్పత్రి వర్గాల్లో దీనిపై చర్చ నడుస్తోంది. వివరాలిలా ఉన్నాయి. హనుమంతరావు గతంలో వైద్య ఆరోగ్యశాఖ పరిధిలో గూడూరు డివిజన్‌కు డిప్యూటీ డీఎంహెచ్‌వోగా విధులు నిర్వహించే వారు. అనారోగ్య కారణాలతో గత ఏడాది నవంబరు ఒకటినుంచి ఈనెల 17వ తేదీవరకు మెడికల్ లీవులో ఉన్నారు. ఈ క్రమంలో తిరిగి విధుల్లో చేరుతున్నట్లు వైద్య ఆరోగ్యశాఖ అధికారికి రిపోర్టు చేయలేదు. ఈ పరిస్థితుల్లో డైరెక్టర్ ఆఫ్ హెల్త్ అధికారి ఆయన్ను నేరుగా రుయా డిప్యూటీ సీఎస్ ఆర్ఎంవోగా నియమించడమే విమర్శలకు తావిచ్చింది.

నిబంధనలకు విరుద్ధంగా ఓ ప్రైవేటు కాలేజీలో పనిచేశారు!

హనుమంతరావు మెడికల్ లీవులో ఉన్నప్పుడు నిబంధనల విరుద్ధంగా పుత్తూరు మండలంలోని అన్న గౌరి మెడికల్ కాలేజీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేశారని సమాచారం.

పంటలపై ఆగని గజదాడులు



కల్లూరు: పులిచెర్ల మండలంలో పంటలపై ఏనుగుల గుంపు దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. కల్లూరులోని అబ్దుల్ యాసిన్‌కు చెందిన ఎకరా టమోటా పంటను ధ్వంసం చేశాయి. సయ్యద్ బాషాకు చెందిన వరినారును తొక్కేశాయి. యుగంధర్‌కు చెందిన 6 మామిడిచెట్లు, 7 కొబ్బరిచెట్లను విరిచేశాయి. కోటపల్లి భాస్కర్ నాయుడు, పెదబ్బనాయుడుకు చెందిన 20 రాతికూసాలను.. బాబునాయుడుకు చెందిన పశుగ్రాసంను ధ్వంసం చేశాయి. అనంతరం ఎర్రచెరువులోని గుంతలను తొక్కేశాయి.

వంగసానివారిపల్లెలో జంట ఏనుగులు

సోమల: సోమల మండలం ఆవులపల్లె పంచాయతీ వంగసానివారిపల్లె సమీపంలో జంట ఏనుగులు తిరుగుతున్నాయి. పంటలను ధ్వంసం చేస్తున్నాయి. టమోటా కోతల సమయంలో తోటను తొక్కేయడంతో నష్ట పోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. పంటలు కోల్పోయిన తమకు నష్టపరిహారం అందించాలని సచివాలయంలో వినతిపత్రం అందజేశారు.

ఫ్యాక్టరీల నుంచి టన్నుకు రూ.30 వేలు పొందండి

● మామిడి రైతులకు కలెక్టర్ సూచన

చిత్తూరు (సెంట్రల్), జూన్ 24: మామిడి కాయలను ఫ్యాక్టరీలకు తరలించి టన్నుకు రూ.30 వేలు పొందాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ రైతులకు సూచించారు. మామిడి కోతలు ఒక్కసారిగా జరిగినందున తోతాపురి టన్ను ధర రూ.29 వేల నుంచి రూ.24 వేలకు పడిపోవడంపై మామిడి రైతులు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. దీనిపై స్పందించిన ఆయన జిల్లాలోని పల్ప్ ఇండస్ట్రీస్ యాజమాన్యాలు, వ్యవసాయ, మార్కెటింగ్, ఉద్యాన శాఖాధికారులతో సమీక్షించారు. తోతాపురి టన్నుకు రూ.30 వేలు ఇవ్వాలని స్పష్టంచేశారు. రైతులు కూడా కోసిన కాయలను ర్యాంపులు, మార్కెట్ యార్డుల్లో కాకుండా పరిశ్రమలకు తరలించి లాభపడాలన్నారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు సంబంధిత శాఖల అధికారులు తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఉద్యాన అధికారి మధుసూదన్‌రెడ్డి, మార్కెటింగ్ ఏడీ పరమేశ్వరన్, ఫ్యాక్టరీ యాజమాన్యాలు పాల్గొన్నారు.

ఎనిమిది మండలాల్లో వర్షం

చిత్తూరు కలెక్టరేట్, జూన్ 24: నైరుతి రుతుపవనాల ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా సోమవారం ఎనిమిది మండలాల్లో తేలికపాటి వర్షపాతం నమోదైంది. మండలాలవారీగా కుప్పం మండలంలో 30.4మి.మీ., పెద్దపంజాణిలో 22.2, సదుంలో 9.2, కార్వేటినగరంలో 5.4, పలమనేరులో 4.8, పుంగనూరులో 3.2, పులిచెర్లలో 3.0, నగరి మండలంలో 2.6 మిమీ వర్షపాతం నమోదయ్యింది.

చిత్తూరు

జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి

కూటమి ప్రభుత్వంలో మహిళలకు రక్షణ

● జిల్లా తెలుగుమహిళ అధ్యక్షురాలు కార్జాల అరుణ



చిత్తూరు సిటీ, జూన్ 24: టీడీపీ కూటమి ప్రభుత్వంలో మహిళలకు రక్షణ ఉంటుందని జిల్లా తెలుగుమహిళ అధ్యక్షురాలు కార్జాల అరుణ అన్నారు. సోమవారం జిల్లా టీడీపీ కార్యాలయంలో ఆమె మీడియాతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు పాలనలో మహిళలకు భద్రత, భరోసా ఉంటుందన్నారు. మహిళలపట్ల ఎవరైనా అఘాయిత్యాలు చేయాలన్నా భయపడతారని పేర్కొన్నారు. ఇటీవల బాపట్లలో ఓ మహిళపై అత్యాచారం జరిగినట్లు తెలిసిన వెంటనే సీఎం రూ.10 లక్షల ఆర్థికసాయాన్ని హోంమంత్రి అనిత ద్వారా తక్షణ సాయం కింద అందించారన్నారు. ఈ ఘటనలో నిందితులను 48 గంటల్లో అరెస్టు చేయాలని ఆదేశిస్తే, 36 గంటల్లోనే అరెస్టు చేసి రిమాండ్‌కు పంపిచారని చెప్పారు. మహిళలకు రక్షణగా నిలుస్తున్న ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలుపుతున్నామని చెప్పారు. కార్యక్రమంలో వరలక్ష్మి, రాణి తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తారు

● టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సురేంద్రకుమార్

చిత్తూరు సిటీ, జూన్ 24: ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తారని టీడీపీ రాష్ట్ర అధికారప్రతినిధి సురేంద్రకుమార్ అన్నారు. సోమవారం జిల్లా పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. సీఎంగా బాధ్యతలు స్వీకరించిన రోజే కీలకమైన ఐదు విషయాలపై సంతకాలు చేయడం.. ఆ అంశాలకు క్యాబినెట్‌లో ఆమోదం తెలపడంపట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. చంద్రబాబు ఎన్నికల ముందు చెప్పిన విధంగా మొట్టమొదటి సంతకం మెగా డీఎస్సీ, రెండో సంతకం ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ రద్దు, మూడో సంతకం పెన్షన్లు రూ.3 వేల నుంచి రూ.4 వేలకు పెంచడం, నైపుణ్య గణన కోసం నాలుగో సంతకం, అన్న క్యాంటీన్‌ల పునరుద్ధరణ కోసం ఐదవ సంతకం చేశారని చెప్పారు. ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో చంద్రబాబు చిత్తశుద్ధితో ఉన్నారని సురేంద్రకుమార్ అన్నారు.

ఎం.కంద్రిగ వద్ద అండర్ బ్రిడ్జి ఏర్పాటు చేయండి

● చిత్తూరు - తచ్చూరు హైవేపై గ్రామస్థుల ధర్నా



గంగాధరనెల్లూరు, జూన్ 24: గంగాధరనెల్లూరు - అంబోధరపల్లె రహదారిలో ఎం.కంద్రిగ వద్ద అండర్‌పాస్ బ్రిడ్జి ఏర్పాటుచేయాలని మండల టీడీపీ అధ్యక్షుడు స్వామిదాస్ గ్రామస్థులతో కలిసి సోమవారం చిత్తూరు-తచ్చూరు హైవేపై ధర్నా చేశారు. హైవే కాంట్రాక్టుకు చెందిన సూపర్‌వైజర్ ధర్నా చేస్తున్న వారితో మాట్లాడుతూ ప్రధాన జనరల్ మేనేజర్ అందుబాటులో లేరని, ఆయనతో సంప్రదించి సమస్య పరిష్కారానికి కృషిచేస్తానని హామి ఇచ్చారు. దీంతో గ్రామస్థులు ధర్నా విరమించారు.

డ్రగ్స్ పట్ల యువత అప్రమత్తంగా ఉండాలి



డ్రగ్స్‌పై అవగాహన కల్పిస్తున్న సెబ్ సీఐ హరికృష్ణ

యాదమరి, జూన్ 24: డ్రగ్స్ పట్ల యువత, విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని సెబ్ సీఐ హరికృష్ణ సూచించారు. సోమవారం మండలంలోని యాదమరి ఉన్నత పాఠశాలలో డ్రగ్స్‌పై అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ డ్రగ్స్ వాడటం వల్ల యువత పెడధోరణి పట్టే అవకాశం ఉందన్నారు. యుక్త వయస్సులో నుంచే విద్యార్థులు సన్మార్గంలో నడవాలన్నారు. డ్రగ్స్‌కు దూరంగా ఉంటేనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని సూచించారు. ఎస్ఐలు, పోలీసులు పాల్గొన్నారు.

నిరుపేదలను ఆదుకోవడానికే అన్న క్యాంటీన్

గుడిపాల, జూన్ 24: నిరుపేద కుటుంబాలను ఆదుకోవడం కోసమే అన్న క్యాంటీన్‌ను నిర్వహిస్తున్నట్లు మండల టీడీపీ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు అన్నారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ అధికారం ఉన్నా లేకున్నా దాతల సహకారంతో ఈ క్యాంటీన్‌ను నిర్వహిస్తున్నామన్నారు. పేదవాడి ఆకలిని తీర్చడమే ధ్యేయంగా టీడీపీ పనిచేస్తుందన్నారు. మాజీ సర్పంచ్ ప్రతాప్ నాయుడు, రవి నాయుడు, హరి నాయుడు, చల్లా, కోటి, బాలసుబ్రహ్మణ్యం యాదవ్, శివలింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ అసిస్టెంట్‌కు పదవీ విరమణ సన్మానం



సమావేశంలో మాట్లాడుతున్న గాజుల నాగేశ్వరరావు

కార్వేటినగరం, జూన్ 24: కార్వేటినగరం ప్రభుత్వ హైస్కూల్లో స్కూల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహించి పదవీ విరమణ చేసిన నాగలక్ష్మిని సోమవారం పలువురు సన్మానించారు. నాగలక్ష్మి విద్యార్థులకు చేసిన సేవలను ఎంఈవో విజయకుమార్ కొనియాడారు. ఎస్టీయూ ఉపాధ్యాయ వాణి మాసపత్రిక ఎడిటర్ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంపై అవగాహన

విజయపురం, జూన్ 24: విజయపురం మండల పరిషత్ కార్యాలయంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లకు, పంచాయతీ కార్యదర్శులకు, ఏఎన్ఎంలకు ఎంపీడీవో బ్రహ్మయ్య సోమవారం పారిశుద్ధ్యం, డయేరియాపై అవగాహన సమావేశం నిర్వహించారు. ప్రతి పంచాయతీలో పారిశుద్ధ్య చర్యలు మెరుగు పరచాలని సూచించారు. ఎంఈవో హరిప్రసాద్‌వర్మ, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ శ్రీకాంత్, వైద్యాధికారులు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్, తదితరులు పాల్గొన్నారు.

డయేరియా పట్ల అప్రమత్తంగా ఉండండి

పాలసముద్రం, జూన్ 24: వర్షాకాలం ప్రారంభమైనందు వల్ల నీరు కలుషితమై డయేరియా సోకే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో రామనాథరెడ్డి పేర్కొన్నారు. సోమవారం వెలుగు కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఏఎన్ఎంలు, వీఆర్వోలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రజలు ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. తాగునీటి బోర్లు ట్యాంకుల వద్ద క్లోరినేషన్ చేయాలని ఆదేశించారు. తహసీల్దారు జయలక్ష్మి, ఎంఈవో రాజేంద్రప్రసాద్, ఈవోపీఆర్డీ రమేష్, పీహెచ్ఓ జ్ఞానశేఖర్, సూపర్‌వైజర్ మురళి తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్తగా ఉండాలి

బంగారుపాళ్యం, జూన్ 24: సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని ఎంపీడీవో శివశంకర్ అన్నారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో వైద్యులు, పంచాయతీల కార్యదర్శులు, ఇతర శాఖల అధికారులతో సమావేశమై సీజనల్ వ్యాధులు, అంటువ్యాధులు, అతిసారా, డయేరియా వంటి వ్యాధుల పట్ల ముందస్తుగా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి డాక్టర్ రమేష్ వివరించారు. ఎంఈవో నాగేశ్వరరావు, హరిక్రిష్ణ, ఏఎన్ఎంలు, పంచాయతీ కార్యదర్శులు, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో రూ.10 వేల జరిమానా



అరెస్టు అయిన నిందితుడితో కానిస్టేబుల్

నగరి జూన్ 24: మద్యం సేవించి ద్విచక్రవాహనం నడిపిన కేసులో విజయపురం మండలం ఆలపాకం దళితవాడకు చెందిన గుణశేఖర్(24)కు నగరి కోర్టులో జూనియర్ సివిల్ జడ్జి విష్ణువర్మ రూ.10వేలు జరిమానా విధించారు. పోలీసుల కథనం మేరకు... నిందితుడు గుణశేఖర్ నింద్ర పోలీస్‌స్టేషన్ పరిధిలో మద్యం సేవించి వాహనం నడుపుతుండగా పోలీసులు పట్టుకుని కోర్టులో సోమవారం హాజరుపరిచారు. జడ్జి విచారించి అతడికి జరిమానా విధించినట్లు నింద్ర కానిస్టేబుల్ కె.చిరంజీవి తెలిపారు.

విద్యార్థులకు విద్యాసామగ్రి పంపిణీ



నగరి, జూన్ 24: నగరి పెరుమాల్ గుడి వీధిలోని ప్రాథమిక పాఠశాలలో సోమవారం దాతలు పూజ, రిత్విన‌శ్రీలు విద్యార్థులకు విద్యా సామగ్రి అందించారు. హెచ్ఎం సురేష్, కమిటీ అధ్యక్షురాలు మీనా, టీడీపీ నాయకులు గుణశేఖర్, జ్యోతి నాయుడు, రాజశేఖర్, రాజా, చిట్టిల సమక్షంలో దాతలు పలకలు, నోట్‌బుక్స్, బ్యాగ్‌లు, పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు.

వెదురుకుప్పం: అగ్గిచేనుపల్లె ప్రాథమికోన్నత పాఠశాల



అగ్గిచేనుపల్లెలో విద్యా సామగ్రిని అందిస్తున్న టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి మోహన్‌మురళి

విద్యార్థులకు టీడీపీ యువ నాయకుడు, పాఠశాల కమిటీ ఛైర్మన్ శివకుమార్ వితరణతో టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి పి.మోహన్‌మురళి సోమవారం నోట్ బుక్స్, పెన్సిళ్లు, పలకలు, ప్యాడ్లు తదితరాలను పంపిణీ చేశారు. హెచ్ఎం అక్బర్, టీచర్ రవి, టీడీపీ ఎస్సీ సెల్ మండలాధ్యక్షుడు వరప్రసాద్, ఐటీడీపీ మండలాధ్యక్షుడు కార్తిక్, సీఆర్పీలు విక్కీ, షణ్ముగం పాల్గొన్నారు.

విజయపురం: మండలంలోని కాళికాపురం, కేవీపురం



కేవీపురంలో విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ

ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు సోమవారం యువ ఇంజనీర్లు భాస్కర్‌రాజు, ఢిల్లీవర్మ, సుధీర్‌వర్మ, శ్రీనివాస్, బాలసుబ్రహ్మణ్యం తదితరులు విద్యాసామగ్రిని అందించారు. విద్యార్థులకు నోటు పుస్తకాలు, క్రయాన్స్, పెన్సిల్, ఎరేజర్ వితరణగా పంపిణీ చేశారు. రిటైర్డు ప్రధానోపాధ్యాయులు చంద్రయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కారు ఢీకొని ఇద్దరికి తీవ్రగాయాలు

పూతలపట్టు, జూన్ 24: కారు ఢీకొని ద్విచక్రవాహనంపై వెళ్తున్న ఇద్దరు తీవ్రంగా గాయపడి ఆస్పత్రి పాలయ్యారు. పీలేరుకు చెందిన మల్లికార్జున, చౌడేపల్లి గ్రామానికి చెందిన రేణుకలకు త్వరలో వివాహం కానుంది. వీరు సోమవారం కాణిపాకం వినాయకస్వామిని దర్శించుకుని ద్విచక్రవాహనంలో తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా, మండల పరిధిలోని కిచ్చెన్నగారిపల్లె బస్టాప్ సమీపాన బెంగళూరు నుంచి తిరుపతి వైపు వెళ్తున్న కారు వెనుకవైపు నుంచి ఢీకొంది. దీంతో మల్లికార్జున, రేణుకలు తీవ్రంగా గాయపడగా, 108 సిబ్బంది చికిత్స నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం రాణిపేట సీఎంసీకి తరలించారు. సీఐ సుదర్శన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తొమ్మిది వినతులు

చిత్తూరు, జూన్ 24: చిత్తూరు నగరపాలక కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా పిర్యాదులు - పరిష్కార వేదిక కార్యక్రమానికి నగర నలుమూలల నుంచి తొమ్మిది వినతులు అందాయని కమిషనర్ అరుణ తెలిపారు. కమిషనర్ ఆదేశాల మేరకు సహాయ కమిషనర్ రామకృష్ణుడు బాధితుల నుంచి వినతిపత్రాలను స్వీకరించారు. కార్యక్రమంలో భాగంగా ప్రజారోగ్యం విభాగానికి 4, ఇంజనీరింగ్‌కు 3, టౌన్‌ప్లానింగ్, మెప్మాశాఖలకు చెరో ఒక్కో అర్జీవంతున అందాయి. వినతులను సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, పరిష్కరించాలన్నారు. వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

'వైసీపీ కార్యకర్తలు అధైర్యపడొద్దు'

గుడిపాల, జూన్ 24: ఓటమి భయంతో వైసీపీ కార్యకర్తలు అధైర్యపడొద్దని, గుడిపాల ప్రజలకు రుణపడి ఉంటానని ఆర్టీసీ మాజీ వైస్‌ఛైర్మన్ ఎంసీ విజయానందరెడ్డి అన్నారు. సోమవారం ఆయన గుడిపాల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కార్యకర్తలకు ఏ సమస్య వచ్చినా మీ ముందుంటానని హామీయిచ్చారు. ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి, జడ్పీ వైస్‌ఛైర్‌పర్సన్ రమ్య, కోఆప్షన్ సభ్యుడు కార్మేఘన్, సర్పంచ్‌లు రజినీకాంత్, మధుసూదన్ రాయల్, కార్యకర్తలు పాల్గొన్నారు.



కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన సుమిత్ కుమార్‌కు సోమవారం కలెక్టరేట్‌లో కాణిపాకం ఆలయ ప్రసాదాన్ని అందజేసి ఆశీర్వచనాలు అందిస్తున్న వేద పండితులు, శాలువ కప్పి వినాయకుడి చిత్రపటం అందజేస్తున్న ఆలయ ఈవో వెంకటేశు, కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న డీఆర్వో పుల్లయ్య, సాంఘిక సంక్షేమశాఖ డీడీ రాజ్యలక్ష్మి, ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ కలెక్టరేట్ యూనిట్ నాయకులు, జిల్లా రిజిస్ట్రార్ శ్రీనివాసరావు

ఎంపీ దగ్గుమళ్లకు శుభాకాంక్షల వెల్లువ

చిత్తూరు సిటీ, జూన్ 24: చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావుకు టీడీపీ కూటమి నేతలు, కార్యకర్తలు, అభిమానులు శుభాకాంక్షలు తెలిపారు. సోమవారం ఢిల్లీ లోక్‌సభలో ఆయన పార్లమెంటు సభ్యుడిగా ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ తమ అధినేత చంద్రబాబు తన మీదపెట్టుకున్న నమ్మకాన్ని వమ్ముకానీయనని చెప్పారు. రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం కోసం ప్రజా సేవకుడిగా పనిచేస్తానని పేర్కొన్నారు. ప్రజల ఆశయాలకు అనుగుణంగా తన కర్తవ్యాన్ని చిత్తశుద్ధితో నిర్వర్తిస్తానని దగ్గుమళ్ల ప్రసాదరావు తెలిపారు. కాగా దగ్గుమళ్ల ప్రసాదరావుకు శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, మాజీ ఎమ్మెల్యేలు సీకే బాబు, ఏఎస్ మనోహర్, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సురేంద్రకుమార్, పార్టీ చిత్తూరు పార్లమెంటు అధ్యక్షులు సీఆర్ రాజన్, ప్రధాన కార్యదర్శి కోదండయాదవ్, రాష్ట్ర తెలుగుమహిళ ఉపాధ్యక్షురాలు వైవీ రాజేశ్వరి, మాజీ మేయర్ కటారి హేమలత తదితరులు ఉన్నారు.

ఆదాయవనరులు పెంచాలి

- నూతన కలెక్టర్ సుమిత్ కుమార్

చిత్తూరు కలెక్టరేట్, జూన్ 24: జిల్లా అంతటా రిజిస్ట్రేషన్ శాఖ ద్వారా అందుతున్న ఆదాయ వనరులు వంద శాతం లక్ష్యంగా పెంచాలని నూతన కలెక్టర్ సుమిత్ కుమార్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని స్పందన హాలులో గ్రీవెన్స్‌డే సందర్భంగా నూతన కలెక్టర్‌కు జిల్లా రిజిస్ట్రార్ శ్రీనివాసరావు పుష్పగుచ్ఛం బహూకరించి జిల్లా రిజిస్ట్రేషన్ శాఖ ద్వారా అందుతున్న ఆదాయ వివరాలను వివరించారు. ఆయన మాట్లాడుతూ ఎనిమిది సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల ద్వారా అందుతున్న ఆదాయాలు, కొనసాగుతున్న రిజిస్ట్రేషన్ల గూర్చి వివరించారు. చిత్తూరు జాయింట్ -1 సబ్‌రిజిస్ట్రార్ రహంతుల్లా, ఇతర సబ్‌రిజిస్ట్రార్లు పాల్గొన్నారు.

గంజాయికి బానిసవుతున్న యువత

● పట్టించుకోని అధికారులు



దళవాయిపల్లె క్రాస్ వద్ద మద్యం మత్తులో కింద పడటంతో గాయపడిన వ్యక్తి

గుడిపాల, జూన్ 24: మండలంలో గంజాయి విక్రయాలు జోరందుకోవడంతో యువత రోజురోజుకూ బానిసలవుతున్నారు. చిత్తూరు నుంచి ప్రతివారం గంజాయి మండలానికి సరఫరా అవుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోనందున యువత వీధిన పడుతున్నారు. మండలంలోని పేయనపల్లె, మొగరాలపల్లె, శ్రీరంగంపల్లె, చీలాపల్లె, బొమ్మసముద్రం, మరకాలకుప్పం, 197 రామాపురం గ్రామాల్లో చిత్తూరు నుంచి గంజాయిని తెప్పించుకుని ఉదయం, సాయంత్రం వేళల్లో గుర్తు పట్టని విధంగా విక్రయిస్తున్నారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ప్రతి రోజు యువత రూ.100 నుంచి రూ.200 గంజాయి కోసం వెచ్చించి తమ జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారని గ్రామస్థులు వాపోతున్నారు. దీనికితోడు ఎక్కడ పడితే అక్కడ సారా విక్రయిస్తుండటంతో మందుబాబులు తాగిన మత్తులో పడిలేచి గాయాలపాలవుతున్నారు. సోమవారం చిత్తూరు-వేలూరు రహదారిలోని దళవాయిపల్లె క్రాస్ వద్ద బాగాయంకు చెందిన తమిళనాడువాసులు మద్యం సేవించి తీవ్రంగా గాయపడ్డారు. అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్ ఆత్మహత్యా యత్నం



చికిత్స పొందుతున్న ఫీల్డ్ అసిస్టెంట్ రమేష్

విజయపురం, జూన్ 24: మనస్తాపంతో ఫీల్డ్ అసిస్టెంట్ రమేష్(36) ఆత్మహత్యా యత్నానికి పాల్పడిన ఘటన మండలంలోని కాళికాపురంలో సోమవారం జరిగింది. గ్రామస్థుల కథనం మేరకు... రమేష్ ఉపాధి హామీ పథకంలో 15 సంవత్సరాల నుంచి ఫీల్డ్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వం మారింది.. నిన్ను ఉద్యోగం నుంచి తీసివేస్తారని గ్రామంలో కొంత మంది ప్రచారం చేయడంతో మనస్తాపానికి గురై పురుగుల మందు తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. గమనించిన గ్రామస్థులు హుటాహుటిన నగరి ప్రైవేటు ఆస్పత్రికి తరలించడంతో చికిత్స పొందుతున్నాడు.

బావిలో పడి వ్యక్తి మృతి



మృతి చెందిన క్రిష్ణమ నాయుడు

పెనుమూరు, జూన్ 24: మండలంలోని పెనుమూరు-చిత్తూరు మార్గంలో గంగుపల్లి చెరువు వద్ద రోడ్డు పక్కన ఉన్న బావిలో పడి వ్యక్తి మృతిచెందిన ఘటన సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం మేరకు.. గుత్తావాండ్లవూరు గ్రామానికి చెందిన నారప్ప నాయుడు కుమారుడు క్రిష్ణమ నాయుడు(65) ఆవులను మేపుతూ ప్రమాదవశాత్తు బావిలో పడి మృతి చెందాడని తెలిపారు. ఫైర్ సిబ్బంది వచ్చి మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించే విద్యార్థులకు

ప్రోత్సాహక నగదు పురస్కారం



గంగాధరనెల్లూరు హైస్కూల్‌కు బీరువాను అందజేసిన పూర్వవిద్యార్థులు, పాల్గొన్న హెచ్ఎం, టీచర్లు

గంగాధరనెల్లూరు, జూన్ 24: పదవ తరగతి పరీక్షల్లో ప్రతి ఏడాది ఉత్తమ ఫలితాలను సాధించే విద్యార్థులకు ప్రోత్సాహక నగదును అందజేస్తామని 1982-83లో పదవ తరగతి చదివిన పూర్వవిద్యార్థులు ప్రకటించారు. గంగాధరనెల్లూరు హైస్కూల్‌కు రూ.20వేలు విలువచేసే బీరువా, 2024 పదవతరగతి ఫలితాల్లో 561 మార్కులతో మొదటిస్థానం సాధించిన భిస్వత్‌కు రూ.2,016లు పూర్వ విద్యార్థులు అందచేశారు. ఈ విద్యార్థికే పూర్వ విద్యార్థి తులసి రూ.500, గణితంలో నూటికి నూరు మార్కులు సాధించినందుకు రూ.1000 గణిత టీచర్ శ్రీధర్ అందజేశారు. ద్వితీయ స్థానం మార్కులు సాధించిన ఎస్.ధరణికి రూ.1,516, తృతీయ స్థానం మార్కులు సాధించిన ఉమామహేశ్వరికి రూ.1,016 ప్రోత్సాహక నగదును పూర్వవిద్యార్థులు అందజేశారు. హెచ్ఎం హేమలత, అసిస్టెంట్ హెచ్ఎం దినకర్, పూర్వ విద్యార్థులు రెడ్డెప్పరెడ్డి, మధుసూదన్, లోకనాధరెడ్డి, వాసు, ప్రభాకర్‌రెడ్డి, జయచంద్ర నాయుడు, చంద్రన్, తులసి, సురేఖ, యుగంధర్, టీచర్లు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

'నేను బడికి పోతా' ర్యాలీ

పాలసముద్రం, జూన్ 24: నేను బడికి పోతా, పిల్లలు ఉండాల్సింది పనిలో కాదు.. బడిలో అంటూ ఎమ్మార్సీ కార్యాలయం నుంచి పాలసముద్రం వరకు సోమవారం ఎంఈవో రాజేంద్ర ప్రసాద్ ఆధ్వర్యంలో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఎంఈవో మాట్లాడుతూ బడి మానేసిన పిల్లలందరినీ బడిలో చేర్పించాలని, ప్రతి విద్యార్థి చదువుకోవాలని పిలుపునిచ్చారు. ఎంఈవో-2 గిరిజ, హెచ్ఎం మీనాక్షి, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణంలో వ్యవసాయం



రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

యాదమరి, జూన్ 24: తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణంలో వ్యవసాయం చేయవచ్చని ఎంఏవో సతీష్ అన్నారు. సోమవారం మండలంలోని జంగాలపల్లెకు చెందిన రైతు జగన్నాథరెడ్డి పొలంలో అమర్చిన బిందుసేద్యం పరికరాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమ్ల చికిత్స ద్వారా పూడిన డ్రిప్పర్లను ఎలా బాగు చేయాలో వివరించారు. స్క్రీన్‌ఫిల్టర్, హైడ్రో సైక్లోన్ ఫిల్టర్‌లను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు సబ్సిడీ కింద డ్రిప్ పరికరాలు కావాలని అడగ్గా... ప్రభుత్వం అందించిన వెంటనే ఇస్తామని అధికారులు చెప్పారు. సాయి, నదీమ్, సాయినాధరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గంగాధరనెల్లూరు: బిందు సేద్యంతో తక్కువ నీటిని వినియోగించుకుని ఎక్కువ భూమి విస్తీర్ణంలో పంటలు సాగుచేసుకోవచ్చునని ఎంఏవో సతీష్ పేర్కొన్నారు. మండలంలోని పాపిరెడ్డిపల్లె పంచాయతీ పెడకంటిపల్లెలో సోమవారం బిందుసేద్యంపై రైతులకు జయలక్ష్మి పొలంలో అవగాహన కల్గించారు. విఏఏ చక్రవర్తి, ప్రొటిక్ కంపెనీ ప్రతినిధి చిన్నదొరై, రైతులు పాల్గొన్నారు.

అశ్వవాహనంపై ఊరేగిన కోదండరాముడు



తవణంపల్లె, జూన్ 24: మండలంలోని టి.పుత్తూరు కోదండరామాలయంలో జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం కోదండరాముడు అశ్వవాహనంపై ఊరేగారు. ఉదయం స్వామివారికి తిరుమంజనం, పాలాభిషేకం, ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం ఉత్సవమూర్తులకు ఉంజల్‌సేవ నిర్వహించి అశ్వ వాహనంపై మేళతాళాల నడుమ పురవీధుల్లో ఊరేగించారు. ఆలయ ధర్మకర్త సిద్ధేశ్వర రెడ్డి, ఉభయదారులతో పాటు భక్తులు పాల్గొన్నారు.

ఈహెచ్ఎస్ కార్డుల సమస్యలు పరిష్కరించాలి: ఆపస్

చిత్తూరు (సెంట్రల్), జూన్ 24: ఎంప్లాయిస్ హెల్త్ స్కీం (ఈహెచ్ఎస్) కార్డు అమలులో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఆపస్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బాలాజీ, సత్యనారాయణ రాష్ట్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ, వైద్య శాఖ మంత్రి సత్యకుమార్‌కు విజ్ఞప్తి చేశారు. సోమవారం విజయవాడలోని ఆయన కార్యాలయంలో ఆపస్ నాయకులు కలిసి ఈమేరకు వినతిపత్రం సమర్పించారు. మంత్రిని కలిసిన వారిలో సంఘం నాయకులు సురేష్, రఘునాథ్ తదితరులు ఉన్నారు.

ప్రభుత్వం మారినా పదవులు వీడని వైసీపీ నాయకులు

కార్వేటినగరం, జూన్ 24: మండలంలో ముగ్గురు వైసీపీ నాయకులు రాష్ట్రంలో ప్రభుత్వం మారినా తమ పదవులను మాత్రం వదులుకోవడానికి ఇష్టపడలేదు. కార్వేటినగరం రాష్ట్ర దేవదాయ శాఖ పరిధిలోని సుబ్రమణ్యేశ్వర స్వామి ఆలయ ఛైర్మన్ పదవికి, దాసరి కార్పొరేషన్ డైరెక్టర్ పదవికి ఒక మహిళ, కొల్లాగుంటకు చెందిన మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్ పదవికి మరో మహిళ రాజీనామా చేయకుండా కొనసాగుతున్నారు. ప్రభుత్వం మారినా పదవులను వదలని ఈ వైసీపీ నాయకులను వెంటనే వారి వారి పదవుల నుంచి తొలగించడానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీ నాయకులు కోరుతున్నారు.

ఉత్తమ టీడీపీ కార్యకర్తకు ప్రశంసాపత్రం



ఎమ్మెల్యే థామస్ నుంచి ప్రశంసా పత్రాన్ని అందుకుంటున్న నాగరాజు

శ్రీరంగరాజపురం, జూన్ 24: ఎస్ఆర్‌పురం మండలం పెద్ద తయ్యూరు గ్రామానికి చెందిన మండల ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు పూజారి నాగరాజుబాబు ఘ్యారిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో చురుగ్గా పాల్గొన్నందుకు, టీడీపీని బలోపేతం చేసినందుకు ఆయనకు ఉత్తమ టీడీపీ కార్యకర్తగా ప్రశంసా పత్రాన్ని గంగాధరనెల్లూరు ఎమ్మెల్యే డాక్టర్ థామస్, మండల పార్టీ అధ్యక్షుడు గంధమనేని జయశంకర్ నాయుడులు సోమవారం అందచేశారు. నిరంజన్‌రెడ్డి, హేమాద్రి యాదవ్, వెంకటేష్, మాధవ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

విజయపురం, పూతలపట్టు మండలాలకు ఎంఈవోల నియామకం

చిత్తూరు (సెంట్రల్), జూన్ 24: జిల్లాలో పదవీ విరమణతో ఖాళీలు ఏర్పడిన విజయపురం, పూతలపట్టు మండలాలకు ఎఫ్ఏసీ కింద సీనియర్ హెచ్ఎంలను ఎంఈవో-1గా నియమిస్తూ కడప ఆర్జేడీ రాఘవరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. నగరి, పీసీఎన్ బాలిక ఉన్నత పాఠశాల హెచ్ఎంగా పనిచేస్తున్న కె.శ్యామలను విజయపురం, శాంతిపురం మండలం సోమపురం డీఎన్‌టీడబ్ల్యు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎంగా పనిచేస్తున్న సి.వాసుదేవన్‌ను పూతలపట్టు ఎంఈవో-1 లుగా ఆర్జేడీ నియమించారు.

నేడు గుండాలమ్మ జాతర

చిత్తూరు కల్చరల్, జూన్ 24: నగరంలోని అశోకపురం పోలీస్‌లైన్ గుండాలమ్మ జాతర మహోత్సవాలు మంగళ, బుధవారాల్లో వైభవంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు మురుగేషన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం అమ్మవారికి పొంగళ్లు, అంబలి సమర్పణ, కుంభ నైవేద్యం నిర్వహించనున్నామని పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం అమ్మవారిని ప్రత్యేక అలంకరణలో ఊరేగించనుండగా, ఓం శక్తి భక్తులు తమ విన్యాసాలతో వచ్చి అమ్మవారికి పూలమాల సమర్పించనున్నట్లు తెలిపారు.

మధ్యాహ్న భోజన పథకం కార్మికుల తొలగింపు తగదు



ఎంఈఓ శ్రీదేవికి వినతిపత్రం అందిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

నగరి, జూన్ 24: మధ్యాహ్న భోజనపథకం కార్మికులను రాజకీయ కక్షతో తొలగించాలనుకోవడం తగదని జిల్లా ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి పేర్కొన్నారు. సోమవారం నగరి ఎంఈవో శ్రీదేవికి వంట నిర్వాహకులను తొలగించరాదని వినతిపత్రం అందించారు. నగరి పట్టణ ఏఐటీయూసీ నాయకులు వేలన్, బాషా, శేఖర్, చిరావుద్దీన్ పాల్గొన్నారు.



గంగాధరనెల్లూరు ఎమ్మెల్యే డాక్టర్ థామస్‌ను పుత్తూరులోని ఆయన స్వగృహంలో ఆదివారం వైసీపీనేతలతో పాటు కలిసి పుష్పగుచ్ఛం అందచేస్తున్న రాష్ట్ర మొదలియార్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ గుణశేఖర్ మొదలి



ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులును సోమవారం తిరుపతిలో మర్యాదపూర్వకంగా కలసి అభినందనలు తెలియజేస్తున్న గంగాధరనెల్లూరు నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జి డాక్టర్ యుగంధర్ పొన్న